గాయపడిన గీత కార్మికుడు మృతి

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్



నెల రోజుల క్రితం తాటిచెట్టుపై నుండి కిందపడి గాయపడిన గీత కార్మికుడు శనివారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన పల్లా రాములు(60) గీత కార్మికుడు గత నెల రోజుల క్రితం రోజువారీగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన రాములను స్థానికులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు.

'చిరుమర్తి మాటలను ప్రజలు నమ్మరు'

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్ మండల నేతలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పన్నాల గూడెం క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం నల్లగొండలో ప్రెస్ మీట్ పెట్టి చిరుమర్తి అబద్ధాలు మాట్లాడారని పేర్కొన్నారు. రౌడీ రాజకీయాలు చిరుమర్తి లింగయ్య చేయడం వల్ల గత ఎన్నికల్లో ప్రజలు ఆయనను ఓడించారన్నారు. వ్యక్తిగత గొడవలను రాజకీయాలకు ముడి పెడుతూ పబ్బం గడుపుతున్నాడని విమర్శించారు. నియోజకవర్గంలో ఇక చిరుమర్తి ఆటలు చెల్లవని దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో గుత్తా మంజులమాధవ్ రెడ్డి, వెంకట్ నర్సయ్య, మాజీ ఎంపీపీ పెరుమళ్ల శేఖర్, బొజ్జ సుందర్, మహేందర్ రెడ్డి, కోట పుల్లయ్య, ఎడ్ల ప్రవీణ్, ఎడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- విషమంగా విద్యార్థిని పరిస్థితి
- ప్రశ్నార్థకంగా ఆత్మహత్యకు గల కారణాలు
- 48 గంటలు గడిస్తేనే కానీ ఏమి చెప్పలేమంటున్న వైద్యులు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రూపావత్ శిరీష (14) అనే విద్యార్థిని శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. పురుగుల మందు తాగిన విద్యార్థినిని చికిత్స నిమిత్తం నల్గొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. మరో రెండు రోజులు గడిస్తే కానీ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై స్పష్టమైన నిర్ణయం రాదని వైద్యులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన శిరీష ను తల్లిదండ్రులు సైదా, స్వాతి లు శుక్రవారం మధ్యాహ్నం వారి సొంత గ్రామమైన దామరచర్ల మండలం వీర్ల పాలెం నుండి మధ్యాహ్నం సుమారు 12:30 గంటల ప్రాంతంలో గురుకులంలో చేర్చారు. కాగా సాయంత్రం 6:30 గంటలకు తిరిగి గురుకులం నుండి గురుకుల పాఠశాల యాజమాన్యం వారు శిరీష కడుపునొప్పితో బాధపడుతుందని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిని తీసుకు వెళ్ళామని మీరు అక్కడికి రావాలని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. శిరీష కు మొదట మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతుంది. కాగా విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియడం లేదు. విద్యార్థిని తల్లిదండ్రులు గురుకుల పాఠశాలపై ఎలాంటి ఆరోపణలు చేయడం లేదు. విద్యార్థిని కూడా వైద్యులు, పోలీసులతో పాఠశాలలోని యాజమాన్యంతో గాని తల్లిదండ్రులతో గాని తనకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పింది.

భిన్నాభిప్రాయాలు...

ఈ సంఘటనపై భిన్న అభిప్రాయాలు



వినిపిస్తున్నాయి. విద్యార్థిని, తల్లిదండ్రులు పాఠశాలపై ఎలాంటి ఆరోపణలు చేయడం లేదు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకునే పాఠశాలకు వచ్చి ఉంటుంది అని భావిస్తున్నారు. గురుకులంలో క్రిమిసంహారక మందులు ఉండే అవకాశం లేదు. కాగా గురుకుల పాఠశాల యాజమాన్యం వారు ఇంటి నుండి క్రిమిసంహారక మందును తీసుకొచ్చిందని ఒకసారి, ఇంటి నుండి మందును తాగి వచ్చిందని మరొకసారి ఆరోపించడం గమనార్హం.

ప్రేమ వ్యవహారమే కారణమా..!

విద్యార్థిని ఓ యువకుడిని ప్రేమించినట్లు తెలుస్తోంది. గురుకుల పాఠశాలలో విద్యార్థిని నోటు పుస్తకంలో పాఠశాల యాజమాన్యానికి ఓ లెటర్ దొరికింది. దాని ప్రకారం ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. పాఠశాల యాజమాన్యం దగ్గర ఉన్న ఆ లెటర్ ను ఎవరికీ చూపించకుండా గోప్యంగా ఉంచారు.

గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమా..?

సెలవుల్లోకి ఇంటికి వెళ్లిన విద్యార్థిని తిరిగి గురుకుల పాఠశాలకు వచ్చిన క్రమంలో పాఠశాలలోకి చేర్చుకునే ముందు పాఠశాల సిబ్బంది విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతోపాటు బ్యాగును పూర్తిగా చెక్ చేసి అనంతరం లెటర్ రాయించుకొని పాఠశాలలోకి అనుమతిస్తారు. ఇక్కడ మాత్రం అవేమీ చేయకుండా పూర్తి నిర్లక్ష్యంతో విద్యార్థిని పాఠశాలలోకి అనుమతిచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల విద్యార్థిని ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఉన్న గురుకులాల పరిస్థితి అంతా అగమ్య గోచరంగా ఉందని గురుకుల పాఠశాల పై ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ఎలాంటి వాసన రాలేదు..

రూపవత్ సైదా, స్వాతి (విద్యార్థిని తల్లిదండ్రులు)

గురుకుల పాఠశాలకు పంపి వచ్చేంతవరకు మా అమ్మాయి వద్ద ఎలాంటి పురుగుమందు వాసన రాలేదు.మేము ఇంటికి వచ్చాక మీ పాప ఆరోగ్యం బాగాలేదు అని పాఠశాల యాజమాన్యం చెప్పారు. వెంటనే బయలుదేరి వెళ్లాం. మా అమ్మాయిని అడగగా మొదటగా నాన్నమ్మ ఇంట్లో మందు తాగాను అని, తరువాత మళ్లీ పాఠశాలలోనే పురుగుల మందు తాగాను అని చెప్పింది.

విద్యార్థిని నానమ్మ ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఉండొచ్చు

ఆగస్టన్ (ఎస్టి గురుకుల పాఠశాల ఆర్సీఓ)

సరిత (గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్)

విద్యార్థిని కళ్లు తిరుగుతున్నాయని, కడుపునొప్పి తో బాధపడుతున్నానని సిబ్బందితో తెలిపింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అక్కడ వున్న స్టాఫ్ నర్స్‌ని పిలిచి చూపించారు. విద్యార్థిని నాన్నమ్మ ఇంటి వద్ద పురుగుల మందు తాగి పాఠశాలకు వచ్చినట్లు చెప్పింది.

దాన,మాన, ప్రాణ రక్షకులుగా పోలీసులు

- ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో నవతెలంగాణ ముఖాముఖి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

కులం మాది ఖాకీ, మతం మాది మాన్యువల్ 24/7 ప్రజల దాన, మాన ,ప్రాణ రక్షకులుగా పోలీసులు పని చేస్తున్నారని ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. ఈ నెల 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో నవతెలంగాణ ముఖాముఖి...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎంతమంది విధి నిర్వహణలో పోలీసులు అమరులయ్యారు.?

15 మంది అమరులయ్యారు.

జిల్లాలు విడిపోయిన తర్వాత నల్లగొండ జిల్లాలో ఎంతమంది పోలీసులు అమరులయ్యారు?

ఎవ్వరు కాలేదు

పోలీస్ అమరవీరుల కోసం ఏమైనా సంక్షేమ పథకాలు ఉన్నాయా జిల్లాలో ప్రత్యేకంగా మీరు ఏమైనా అమలు చేస్తున్నారా?



విధి నిర్వహణలో అమరులైన పోలీస్ కుటుంబ సభ్యులకు కంపన్జేషన్ కింద ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. వారికి ప్రభుత్వం ద్వారా అందవలసిన అన్ని వసతులు సౌకర్యాలు కల్పించడం జరిగింది.

దాన,మాన, ప్రాణ రక్షకులుగా 24 గంటలు విధి నిర్వహణ లో ఉండే పోలీసు సిబ్బంది వారి కుటుంబాలకు సమయం కేటాయించడం తక్కువగా ఉంటుంది.ఈ క్రమంలో పోలీస్ సిబ్బంది పిల్లలకు విద్యారంగంలో ప్రత్యేకంగా ఏమైనా పథకాలు రూపొందించారా?

ప్రతి సంవత్సరం పోలీస్ పిల్లలు విద్యారంగంలో ముందువుండుటకు ప్రోత్సాహంగా మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నాం.

శాంతి భద్రత పరిరక్షణ కోసం ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకుని మిషన్ పరివర్తన్ ప్రవేశపెట్టిన అనంతరం జిల్లాలో ఎలాంటి మార్పు వచ్చింది.?

మిషన్ పరివర్తన్ ముఖ్యంగా యువత చెడు దారిలో పడకుండా తెలిసి తెలియని వయసులో మత్తుపదార్థాలకు బానిసై వారి జీవితాలను నాశనం చేసుకోకుండా వారిలో మార్పు తీసుకురావడం కోసం మిషన్ పరివర్తన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దీని ద్వారా ప్రతిరోజు జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ మాదిరిగా గాంజా టెస్టింగ్ కిట్ల ద్వారా తనిఖీలు నిర్వహించి గంజాయి సేవించి పట్టుబడిన వారికి సైకియాట్రిస్టు డాక్టర్ల ద్వారా గంజాయి సేవించడం వల్ల కలిగే నష్టాలు అనర్థాల పైన కౌన్సిలింగ్ ఇస్తూ మార్పు తీసుకురావడం జరుగుతుంది. తద్వారా జిల్లాలో గంజాయి అక్రమ రవాణా,క్రయ విక్రయం,వినియోగం పూర్తిగా అదుపులో ఉంది.

ఇప్పటివరకు గంజాయి ఎన్ని కేసులు నమోదయ్యాయి?

జిల్లాలో 2024 సంవత్సరంలో 31 కేసులలో 131 మందికి జైలు పంపడం జరిగింది. మొత్తం 771 కేజీల గంజాయి స్వాధీనం చేయడం జరిగింది.

మిషన్ పరివర్తన్‌లో భాగంగాఎంతమందికి మార్పు కోసం కౌన్సిలింగ్ ఇచ్చారు?

ఇప్పటివరకు 327 మందికి సైకియాట్రిస్ట్ డాక్టర్ల ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది.

మాదకద్రవ్యాల బారినపడిన వారి కోసం వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఏమైనా ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారా?

327 మంది కౌన్సిలింగ్ ఇవ్వగా వీరందరికీ రెండవ సారి టెస్ట్ నిర్వహించగా అందులో ఆరుగురుకి మాత్రమే పాజిటివ్ వచ్చింది వీరిని కామినేని డి అడిక్షన్ సెంటర్ కి తరలించి చికిత్స అందించడం జరిగింది.

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇప్పటికే రహదారుల దత్తత తీసుకున్నట్లు మీరు ప్రకటించారు? ఇది ఎప్పటినుంచి అమలు చేయబోతున్నారు.?

ప్రస్తుతం జిల్లాలోని నేషనల్ హైవే, స్టేట్ హైవేలపైన అధిక రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ కోసం సమీక్షిస్తూ నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. జిల్లా ఎస్పీగా(నేను) నలగొండ మండలం, అడిషనల్ ఎస్పీ వేములపల్లి మండలం, నల్గొండ డీఎస్పీ కేతపల్లి మండలం,మిర్యాలగూడ డీఎస్పీ మిర్యాలగూడ మండలం దేవరకొండ డీఎస్పీ చింతపల్లి మండలాలను దత్తత తీసుకొని ప్రతివారం అక్కడికి సందర్శిస్తూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాల నివారణ చర్యలపై రాష్ట్ర రహదారుల సంబంధిత అధికారులకు నివేదిక పంపుతూ అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

పోలీస్ శాఖలో పురుషులతో పాటు మహిళలు కూడా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రత్యేకంగా సంక్షేమం కోసం ఏమైనా పథకాలు ఉన్నాయా?

పోలీస్ శాఖలు మహిళలు, పురుషులు అంటూ ఏమీ వేర్వేరుగా ఉండదు. మహిళల కోసం ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్లో ఉమెన్ రెస్ట్ హౌస్ సైతం నిర్మించాం వారికి ప్రత్యేకంగా సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం.

అన్ని శాఖలకు భిన్నంగా పోలీస్ శాఖ పని చేస్తూ సమాజంలో శాంతి భద్రతలను కాపాడే బాధ్యత తీసుకున్నారు. ప్రత్యేకంగా సిబ్బందికి వారాంతర సెలవు దినాలు ఏమైనా ఉన్నాయా?

ప్రతి పోలీస్ సిబ్బందికి వారాంతపు సెలవులు ఇస్తున్నాం.

జిల్లాలో అక్కడక్కడ పోలీస్ స్టేషన్లో మహిళా సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తుంది. ఈ పరిస్థితిని ఎలా అధిగమిస్తున్నారు.

ఎలాంటి కొరతలేదు.

భవిష్యత్తులో యువత కోసం ఏమైనా ప్రణాళిక రూపొందించారా?

యువత కోసం జాబ్ మేళా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

యువతకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?

యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేలా ప్రణాళిక రూపొందించుకుని కృషి చేయాలి

సమాజ హితం కోసం ప్రజల నుండి మీరు ఏమి కోరుకుంటున్నారు?

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి. తల్లిదండ్రులు తమ పిల్లల ఎదుగుదల కోసం వారి అలవాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి

గత సంవత్సరం ప్రమాదాల రేటు, ప్రస్తుత సంవత్సరం ప్రమాదాల రేటు ఏ విధంగా ఉంది? నివారణ పెరిగిందా? తగ్గిందా?

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ప్రమాదాల రేటు తగ్గింది. ఇప్పటి వరకు తక్కువ గానే ఉంది.

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా సాగర్ల మల్లేశ్

నవతెలంగాణ-మునుగోడు



మండలంలోని కల్వలపల్లి గ్రామంలో జరిగిన సీపీఐ(ఎం) ఎనిమిదవ మండల మహాసభలో కల్వలపల్లి గ్రామానికి చెందిన సాగర్ల మల్లేశ్‌ను మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతోపాటు 14 మంది మండల కమిటీ సభ్యులను పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. ఏండ్ల తరబడి నుండి సొంతగూడు లేక అద్దె భవనాలలో ఉంటూ పత్రికా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ప్రజాపాలన అందించేందుకు ఏర్పాటు చేసే ఇందిరమ్మ కమిటీలలో అన్ని రాజకీయ పార్టీలకు ప్రాతినిత్యం కల్పించాలని కోరారు. మునుగోడు నియోజకవర్గంలో సాగు తాగునీరు లేక అల్లాడుతున్న రైతులకు సాగు, తాగు నీరు అందించేందుకు డిండి ఎత్తిపోతల పథకం, చర్లగూడెం రిజర్వాయర్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యులు మిర్యాల భరత్, వరికుప్పల ముత్యాలు, వేముల లింగస్వామి, యాస రాణి శ్రీను, పగిళ్ల మధు, యాట యాదయ్య, వడ్లమూడి హనుమయ్య, పగడాల కాంతయ్య, కొంక రాజయ్య దొండ వెంకన్న, కట్ట లింగస్వామి, పి పరమేష్‌లను ఎన్నుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి కసరత్తు

- త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రారంభిస్తాం : డీఎస్ఓ వెంకటేశ్వర్లు
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నల్లగొండ జిల్లాలో స్థాయిలో ప్రారంభానికి కసరత్తు చేస్తున్నామని డీఎస్ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇంకా ప్రారంభం కానీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు శుక్రవారం ప్రచురితమైన కథనంకు ఆయన స్పందించారు.



శనివారం ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం 375 కేంద్రాలకు గాను ప్రస్తుతం జిల్లాలో 253 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగినదని, దీనిలో 178 కొనుగోలు కేంద్రాలను, దొడ్డు ధాన్యము సేకరించుటకు, 55 కేంద్రాలను సన్న ధాన్యం సేకరించుటకు ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రములో మొదటగా ఇప్పటివరకు 8200 క్వింటాల దొడ్డు ధాన్యము కొనుగోలు చేయడం జరిగిందన్నారు. వాతావరణము సహకరించని కారణముగా ధాన్యము 17శాతం తేమశాతం రావడానికి సమయం పడ్తున్నందున ధాన్యం కొనుగోల్లు ఎక్కువ మొత్తంలో జరగడంలేదు పేర్కొన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక భరోసా

నవతెలంగాణ-నిడమనూరు

నిరుపేదలకు సిఎంఆర్ఎఫ్ ఒక భరోసా లాంటిదని కాంగ్రెస్ మండల అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మెన్ అంకతి సత్యం అన్నారు. శనివారం మండల కేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండలం లోని ముప్పారం గ్రామానికి చెందిన దారం నాగార్జున కు 15,500, తెలకపల్లి నాగమణి కి 15వేలు సిఎంఆర్ఎఫ్ కింద మంజూరైనా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తరువాత నిరుపేదల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు తీసుకువస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ మేరెడ్డి వెంకట రమణ యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు పగిళ్ల శివ అలంపల్లి మైసయ్య అన్నీబోయిన లక్ష్మి నారాయణ సింగం రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-మునుగోడు

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుండి అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అన్నారు. శనివారం మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన గాదెపాక సురేష్ కు ఎమ్మెల్యే కోమటి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.54 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే ప్రత్యేక క్యాంప కార్యాలయంలోఅందజేశారు . ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జాల వెంకటేశ్వర్లు ,బూడిద లింగయ్య ,మాజీ ఎంపీటీసీ పందుల భాస్కర్ , యువజన కాంగ్రెస్ నాయకులు జంగిలి నాగరాజు, చల్మెడ గ్రామశాఖ అధ్యక్షులు చంద్రయ్య పాల్గొన్నారు.

నోట్ బుక్స్, బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-నాంపల్లి

యూత్ ఫర్ సేవా సహకారంతో నవ నిర్మాణ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని చిట్టంపహాడ్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, చేతుల మీదుగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్, కలర్ పెన్సిల్, అందచేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షులు, సామాజిక సేవా కార్యకర్త కర్నాటి శ్రీహరి, యూత్ ఫర్ సేవా ప్రతినిధి శిరందాస్ సందీప్, పాఠశాల ఉపాధ్యాయులు రజిని పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-వేములపల్లి

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో పౌరశాస్త్ర అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దీనా సుజాత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లీషులో పౌరశాస్త్రం బోధించే ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. సంబంధిత సబ్జెక్టులో ఎంఏ (పొలిటికల్ సైన్స్)లేదా (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్),బీఎడ్ చేసిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

చెరుపల్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి



నవతెలంగాణ-చిట్యాల

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అమ్మ లక్ష్మమ్మ అక్క గంజి రంగమ్మ మృతి పట్ల మాజీ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, నకిరేకల్ మాజీ శాసన సభ్యులు చిరుమర్తి లింగయ్య తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.మండల కేంద్రంలో శనివారం చెరుపల్లి రఘునాధం ఇంటికి వెళ్లివారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా లక్ష్మమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారాములు అమ్మ చనిపోయిన ఆరవ రోజే అక్క రంగమ్మ చనిపోవటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, బీఆర్ యస్ పార్టీ నాయకులు పొన్నం లక్ష్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి,నారబోయిన శ్రీనివాసులు,మెండె సైదులు,జిట్ట బొందయ్య ఆగు అశోక్, కోనేటి ఎల్లయ్య, యండి అబ్బాస్ ,చెరుపల్లి సీతారాములు కుటుంబ సభ్యులు శేషగిరి, జానకి రాములు, రామచంద్రం,రఘునాధం,శ్రీనివాస్ ,కిరణ్ ,అరుణ్ ,ప్రదీప్ ఉన్నారు.

కంప చెట్లతో కమ్మేసిన జమ్మనకోట రోడ్డు

- తరచుగా ప్రమాదాలు

నవతెలంగాణ-తిరుమల గిరిసాగర్

నాగార్జునసాగర్ పైలాన్ కొత్త బ్రిడ్జి నుంచి జమ్మనకోట, చింతలపాలెం వెళ్లే దారికి



ఇరువైపుల పిచ్చిమొక్కలు, కంప చెట్లు పెరగడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారని కృష్ణ పట్టే తండా ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. మూడు రోజుల క్రితం ఎదురెదురుగా వచ్చే రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయాలతో సాగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ రోడ్డు నుంచి జమ్మనకోట, నాగార్జునపేట, చింతలపాలేం, నాయకుని తండా, తిమ్మాయిపాలెం గ్రామాలనుంచి వివిధ పనులకొరకు, కూలీలు ఆటోలలో వెళ్తుంటారు. అంతేగాక కృష్ణపట్టే గ్రామాల నుంచి సాగర్‌కు స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు, నిత్యం వెళుతుంటాయి. ఈ విషయాన్ని గతంలో ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. కానీ ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదు. ఈ రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగించి బాగుచేయాలని క్రిష్ణపట్టే తండాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

నవతెలంగాణ-క్లాక్‌టవర్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 21, 22, 23 తేదీలలో జరిగే ఐద్వా 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి కోరారు. ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం దొడ్డి కొమరయ్య భవన్ లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరిగే హత్యలు, లైంగికదాడులు, నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రోజు రోజుకు మహిళలు, వృద్ధులు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు.ఈ మహాసభల లో గత మూడు సంవత్సరాలుగా సంఘం నిర్వహించిన కార్యక్రమాలు సమీక్షించుకుని భవిష్యత్తులో సంఘం నిర్వహించాల్సి ఉద్యమాలు పోరాటాలను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందా కారత్ , వక్తలు ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె శ్రీమతి, ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శిమరియం ధావలె , ఇంకా మరి కొంతమంది వక్తలు పాల్గొంటారన్నారు. ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల పద్మ, భూతం అరుణ కుమారిమాట్లాడుతూ రాష్ట్ర మహాసభ ప్రారంభ సందర్భంగా ఈ నెల 21న జరిగే బహిరంగ సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహాలక్ష్మి పథకం ఒకటి మాత్రమే అమలు జరిగిందని మిగతా వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డులు ఇంకా ఇవ్వటం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ మహాసభ అనంతరం క్షేత్రస్థాయిలో ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోఆ సంఘం నాయకులు కనుకుంట్ల ఉమారాణి, పుష్పలత, కవిత, దేవి, తులసి కరుణ పాల్గొన్నారు.



రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నవతెలంగాణ-కట్టంగూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా శనివారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మోసపూరిత వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలయ్యాక షరతులు, కొర్రీలు పెట్టి రైతులను నయవంచన చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9వ తారీఖునే రైతుల రుణాలు మాఫీ అవుతాయని చెప్పి పది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు రుణమాఫీ పూర్తి కాలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని లేని పక్షంలోబీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసి తరాల బలరాములు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోగులు నర్సింహ్మా, మాజీ సర్పంచులు గుర్రం సైదులు, పనస సైదులు, మహిళానాయకురాలు గాజుల బుచ్చమ్మ, జిల్లా నాయకులు పెద్ది బాల నర్సింహ, రెడ్డిపల్లి మనోహర్, శిశుపాల్ రెడ్డి, మల్లేష్ శ్రీను, అంజయ్య, యాదయ్య ,వెంకన్న పాల్గొన్నారు.

రైతు భరోసా డబ్బులు వెంటనే ఇవ్వాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య

నవతెలంగాణ-దేవరకొండ



రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటనే జమ చేయాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇటీవల కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో ఉపాధి హామీకి, రెండున్నర లక్షల కోట్లు అవసరం ఉండగా కేవలం రూ. 86 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. దీనిని బట్టి చూస్తుంటే ఉపాధి హామీ లేకుండా చేసే కుట్రలో భాగంగానే కేటాయింపులు జరిగాయని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై 5 నెలలు గడుస్తున్నా నేటికీ రాష్ట్రంలో ఉన్న రైతులకు రైతు భరోసా ద్వారా రుణాలు రైతుల ఖాతాలో వేయలేదన్నారు. రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. బిజిలీ లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య, నాయకులు ఎం పర్వతరెడ్డి, బుడిగ వెంకటేశం, నల్లా శ్రీనివాసు, యాదగిరిపాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే వీరేశం

నవతెలంగాణ- కేతపల్లి



రైతు సంక్షేమమే తమ ప్రభుత్వం ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఇనుపాముల, బండ పాలెం ,కొండకింది గూడెం, చెరుకుపల్లి ,తుంగతుర్తి ,భీమారం, కొప్పోలు ,చీకటి గూడెం, ఉప్పలపాడు గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. సన్నధాన్యానికి రూ. 500 బోనసు తమ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకొని లబ్ధి పొందాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి, మండల అధికారులు,గ్రామ నాయకులు, రైతులు ,నాయకులు పాల్గొన్నారు.

50 వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-తిరుమలగిరి



తిరుమలగిరి మండల కేంద్రం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికై తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకేపల్లి సుధీర్ రెడ్డి రూ.50వేలు శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులకు అందించారు.ఈ సందర్భంగా సంకేపల్లి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల నాయకులు సంకేపల్లి సుధీర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంతఉద్యోగులు మందడి పద్మారెడ్డి,కాకి వెంకటరెడ్డి,బన్వరి నరసయ్య, దామోదర చారి,మల్లయ్య, సుదర్శన్ రావు, పందిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తెలుగుభాషపై క్విజ్ పోటీలు

నవతెలంగాణ-కోదాడటౌన్



పాఠశాల స్థాయి విద్యార్థులకు తెలుగు భాషా వ్యాకరణం, పరిజ్ఞానంపై ప్రత్యేకంగా క్విజ్ పోటీలు నిర్వహించడం వల్ల తెలుగు భాషపై పట్టు, భాషాభివృద్ధి సాధించడంతో పాటు, భవిష్యత్‌లో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణతను సాధించడానికి ఉపయోగపడతాయని కోదాడ బాయ్స్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం డి మార్కండేయ అన్నారు. శనివారం పాఠశాలలో తెలుగు భాష వ్యాకరణం, పరిజ్ఞానం, గ్రంథాలు, కవులు రచనలపై క్విజ్ పోటీ కార్యక్రమం నిర్వహించి విజేతలైన వి ద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వీరబ్రహ్మచారి, చిన్నప్ప, జానకిరామ్, బడుగులసైదులు, రవి తదితరులు పాల్గొన్నారు.

బస్తాల సమస్యతో.... వ్యవసాయ మార్కెట్ బంద్

- తిరుమలగిరి మార్కెట్లో హమాలీలకు, కొనుగోలు వ్యాపారులకు మధ్య బస్తాల తగువ
- ఇరువర్గాల మధ్య ఇరుక్కుపోయిన రైతాంగం
- ప్లాస్టిక్ బస్తాల్లో కాంటా వేయలేమంటున్న హమాలీలు

కొలిక్కిరాని బస్తాల సమస్య

నవతెలంగాణ-తిరుమలగిరి




తిరుమలగిరి మార్కెట్లో హమాలీలకు కొనుగోలుదారులకు మధ్య కాంటాలకు ఉపయోగించే బస్తాల విషయంలో గొడవ జరుగుతుంది. ఈ నేపథ్యంలో మార్కెట్లో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయింది. గన్నీ (తట్టు) బస్తాలను వినియోగించాలని, ప్లాస్టిక్ బస్తాలు వద్దని, ఖరీదుదారులు ప్లాస్టిక్ బస్తాలు వాడాలని ఇరువురి మధ్య బస్తాల లొల్లితో వ్యవసాయ మార్కెట్ బంద్ చేశారు. నిత్యం ధాన్యంతో..రైతులతో రద్దీగా దర్శనమిచ్చే మార్కెట్ షెడ్లు మార్కెట్లో ధాన్యం లేక ఖాళీ షెడ్లతో బోసిపోయాయి. రైతులు ధాన్యంను మిల్లుల వద్ద, గ్రామాల్లో వ్యాపారస్తుల వద్ద తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితిని హమాలీలు, ఖరీదు దారులు తీసుకువచ్చారని రైతులు మండిపడుతున్నారు. ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న ఐకేపీ కేంద్రాలకు ధాన్యం తెచ్చేందుకు రైతులు సాహసం చేయలేకపోతున్నారు. అకాల వర్షాల ముప్పుకు ధాన్యం తడిసిపోతుందని భయాందోళనలో తెచ్చిన ధాన్యంను నిల్వ చేసుకోలేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మంగళవారం రైతులు ఆందోళనలకు దిగడంతో తహశీల్దార్, మార్కెట్ కార్యదర్శి, సబ్ ఇన్స్పెక్టర్ పలువురితో చర్చలు జరిపారు. హమాలీలకు, కొనుగోలుదారులకు రైతులకు సర్దిచెప్పడంతో ఆరోజు కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా జరిగింది.తర్వాతి రోజు సమస్య జఠిలం కావడంతో గురువారం మార్కెట్ కు సెలవు ప్రకటించగా శుక్రవారం, శనివారం పూర్తిగా మార్కెట్‌కు ధాన్యం రాక కొనుగోలు పూర్తిగా ఆగిపోయాయి. హమాలీలు, ఖరీదుదారులు పట్టువిడుపులు వదిలి సమస్యను పరిష్కరించుకోవాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ ఇద్దరికీ సర్ది చెప్పిన వినడం లేదన్నారు. రైతులు ఎమ్మెల్యే మందుల సామెల్ దృష్టికి సమస్యను తీసుకుపోగా ఇరువర్గాలు సమన్వయంతో ముందుకు పోవాలని సూచించినట్టు సమాచారం. శనివారం మార్కెట్ కు ధాన్యం రాకపోవడంతో ఖాళీగానే మార్కెట్ ప్రాంగణం కనిపించింది. జిల్లా కలెక్టర్ ఐన జోక్యం చేసుకొని గన్ని బస్తాల సమస్యను పరిష్కరించాలని రైతులు,మార్కెటింగ్ శాఖ కోరుతున్నారు. ఏది ఏమైనా రైతాంగానికి నష్టం కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సోమవారం నాటికైనా మార్కెట్ యధాతథంగా నడిచేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మోసగించడం కాంగ్రెస్ నైజం

- నియోజకవర్గ బీఆర్ఎస్ వర్క్ షాప్ లో మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట



మాయలు, మోసాలతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, మోసగించడం కాంగ్రెస్ నైజమని మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పంక్షన్ హాల్‌లో జరిగిన పెన్ పహాడ్, చివ్వెంల మండల ముఖ్యనేతల వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు.అదనంగా ఇంకేదో వస్తదని నమ్మి ప్రజలు ఓట్టేశారని కానీ మొదటి నెలనుంచే మోసపోయామన్న భావన ప్రజల్లో మొదలైందని తెలిపారు.ప్రజలకు అండగా నిలబడటం మన బాధ్యత అని పేర్కొన్నారు. కేసీఆర్‌ను తామే దూరం చేసుకున్నామని ప్రజలు పశ్చాత్తాపడుతున్నారని తెలిపారు. నిరంతర ప్రజాసేవ, అభివృద్ధి పాలనే ఆయన నాయకత్వం నేర్పిందన్నారు. క్రమశిక్షణకు మారుపేరు కేసీఆర్, బీఆర్ఎస్ అని చెప్పారు.కార్యకర్తలను కంటికి రెప్పలా కపడుకుంటున్న ఏకైక పార్టీ కూడా మనదే అన్నారు.కార్యకర్తలే పార్టీకి బలం, బలగం అని తెలిపారు.ఎవరెన్ని కుట్రలు చేసినా ఐక్యత కోల్పోవద్దన్నారు.ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంతో కొట్లాడదామని పిలుపునిచ్చారు.ఆరు గ్యారంటీలు అమలయ్యే వరకు ప్రజలతో కలిసి పోరాడదామని పేర్కొన్నారు.కొత్తగా ఇచ్చిన హామీలమాట దేవుడెరుగు కానీ కేసీఆర్ ఇచ్చినవి అయిన వస్తే చాలు అని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు.420 హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో క్లారిటీ ఉందా అని ఆయన ప్రశ్నించారు.అభివృద్ధి మరిచి హైడ్రాతో తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వాలపై విశ్వాసం పెంచుకునే పనిమాని ప్రజలను కన్నీళ్లు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలను ఏడిపించిన ప్రభుత్వాలు కొనసాగినట్టు చరిత్రలో లేదన్నారు.కేసీఆర్ అభివృద్ధి నిర్మాణాలు చేస్తే రేవంత్ కూల్చివేతలతో అరాచకాలు చేస్తున్నడని ఆరోపించారు.తెలంగాణ అభివృద్ధిపై కేసీఆర్ కున్న సోయి కాగ్రెసోళ్లకు వుంటదా అని ఆయన ప్రశ్నించారు.పోరాడి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని అంతా నమ్ముతున్నారని తెలిపారు. ఆ దిశగా బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త ప్రజల పక్షాన అండగా నిలబడాలని కోరారు.

నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధరను పొందాలి

- అడిషనల్ కలెక్టర్ శ్రీలత, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్

నవతెలంగాణ-సూర్యాపేట



రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధరను పొందాలని అడిషనల్ కలెక్టర్ శ్రీలత, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం స్థానిక 8 వార్డులో కౌన్సిలర్ నెల్లుట్ల సోమలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ దాన్యం కొనుగోలు కేంద్రాన్నీ వారు ప్రారంభించి మాట్లాడారు.రైతులు ఐకేపీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి కొని తేమ తాలు లేకుండా కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, గంగ లింగారెడ్డి, నాగేందర్, కొర్రి నాగయ్య, రామకృష్ణ, టీఎంసీ శ్వేత,సీవో సువర్ణ, ఆర్పి కల్పన,ఐకెపి కేంద్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో పంట నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోరపల్లి శేఖరావు

నవతెలంగాణ-నేరేడుచర్ల



అకాల వర్షాలతో పంట నష్టపోతున్న రైతాంగాన్ని యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోరపల్లి శేఖరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అరిబండి భవన్‌లో జరిగిన సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో వరి పంట పొట్ట పోసుకుంటుందని ఇలాంటి పరిస్థితుల్లో అకాల వర్షాల వల్ల పంట నేలకు ఒరిగిందని మండలంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే యుద్ధ ప్రాతిపదికన నష్టం అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొదమ గుండ్ల నగేష్, కందగట్ల అనంత ప్రకాష్ మండల కార్యదర్శి సిరికొండ శీను, నాయకులు మచ్చ సోమయ్య కట్ట మధుబాబు, అల్వాల శ్రీధర్, మామిడి సైదులు బుడిగ ధనుంజయ, బొప్పన రాణమ్మ, పాలకురి రాములమ్మ, పర్సనబోయిన సైదులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు అవసరం

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

గ్రామపంచాయతీ లో ప్రజలకు తాగునీటి అందించడం సహాయకులలో నాణ్యత జాగ్రత్తలు అవసరమని ఆర్డబ్ల్యూఎస్ డీఈ పాండు తెలిపారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన తాగునీటి సహాయకుల మొదటి రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ లో నీటి సరఫరాను అందజేసే గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ నీటిని ప్రజలందరికీ స్వచ్ఛమైన నీటిని అందించాలని తెలిపారు. పరిశుభ్రమైన నీటిని అందించడమే కాకుండా నీటి ట్యాంకుల లో బ్లీచింగ్ చేసి సకాలంలో సరఫరా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హసీం ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ రవికుమార్, ఎంపిఓ రాజేష్, ఏపీవో ఈశ్వర్, నీటి పరిశీలన సిబ్బంది ఆయా గ్రామాల త్రాగు నీటి సహాయకులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

నవతెలంగాణ-తిరుమలగిరి

రైతు పండించిన ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తహసిల్దార్ హరిప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కోట్యా నాయక్ తండా గ్రామంలో ఐకెపి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నాలకు 500 రూపాయల బోనస్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ. 2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈఓ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ ధరావత్ రామోజీ, మహిళ సంఘాలు, కొనుగోలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై కళాకారుల ప్రదర్శన

నవతెలంగాణ-అర్వపల్లి

మండలంలోని కొత్తగూడెం గ్రామంలో శనివారం మాదకద్రవ్యాల నిషేధం తెలంగాణ సంస్థ సారథి టీం లీడర్ ఈర్ల సైదులు ఆధ్వర్యంలో కళాప్రదర్శన నిర్వహించారు . ఈ కార్యక్రమంలో లితెలంగాణ సాంస్కృతిక సారథి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వెన్నెల నాగరాజులి మాగి శంకర్ గడ్డం ఉదయ్ మేడిపల్లి వేణు పాలకుర్తి శ్రీకాంత్ పాక ఉపేందర్ గజ్జి మంజుల సిరిపంగి రాధా నెమ్మాది స్రవంతి పోతరాజు శిరీష గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గాలి వానకు నేల కొరిగిన వరి పొలాలు

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

శనివారం సాయంత్రం కురిసిన ఈదురుగాలుల వర్షానికి మండల పరిధిలోని ఏపూర్ గ్రామంలో సుమారు 10 ఎకరాలకు పైగా వరి పొలాలు నేలకొరిగాయి. మరో 10 రోజుల్లో కోతకు వచ్చిన పంట నేలపాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపూర్ గ్రామానికి చెందిన అవిరె మల్లయ్య వరి పొలం ఈదురుగాళ్లకు నేలకొరిగి వరి ధాన్యం రాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అవిరే అప్పయ్య కోరారు.

అంగన్వాడీ పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలు

నవతెలంగాణ-అర్వపల్లి

మండల పరిధిలోని కొమ్మలకోడూరు గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌లలో 15 మంది ఎస్ ఏఎంఎంఏఎం పిల్లలకు మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్ నాయక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాలామృతం మందులను ఇచ్చి పిల్లల తల్లీ తండ్రులకు కౌన్సిలింగ్ చిన్నపిల్లల కు తీసు కోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అనిత, లలిత, సరస్వతి విజయశాంతి, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం



నవతెలంగాణ-నూతనకల్

ఇటీవల మండల కేంద్రానికి చెందిన సాబాది వెంకట్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామేల్ పంపించిన రూ. 50 వేలు ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ మండల నాయకులు చురకంటి చంద్ర రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పన్నాల మల్లారెడ్డి బద్దం వెంకటరెడ్డి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం

- ప్రారంభోత్సవ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ అప్పారావు

నవతెలంగాణ-అర్వపల్లి



మండలంలోని జాజిరెడ్డిగూడెం పర్సాయపల్లి తదితర గ్రామాల్లో శనివారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిఆర్డిఏ పిడి అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందించే సరేనా మద్దతు ధరను పొందాలన్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ జె శ్రీనివాసులు, ఎంపీడిఓ పవన్ కుమార్, ఆర్ ఐ జలంధర్ వెంకట్ రెడ్డి, ఏపీఎం మల్లేష్ మాజీ జెడ్పీటీసీ కోరపి దుత అవిల్లయ్య, మహిళా సంఘం సభ్యురాలు గ్రామ రైతులు నాయకులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- జిల్లా కోపరేటివ్ అధికారి పద్మ

నవతెలంగాణ-కోదాడరూరల్



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కోపరేటివ్ అధికారి పద్మ అన్నారు. శనివారం మండలపరిధిలోని తొగర్రాయి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కోదాడ వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు సెంటర్‌ను తహసీల్దార్ వాజిద్‌అలీ, పీఏసీఎస్ చైర్మెన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మెన్ నరేష్, డైరెక్టర్లు ప్రభాకర్‌రావు, పుల్లయ్య, సిరంశెట్టి శ్రీనివాసరావు, చంద్రమౌళి, కాంగ్రెస్ మండలఅధ్యక్షులు తుమాటి వరప్రసాద్‌రెడ్డి,ఇర్ల సీతారాంరెడ్డి,నర్సింహారావు, సీఈవో మంద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్:మండలకేంద్రంతో పాటు మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో పీఏసీఎస్ చీదెల్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ లాలునాయక్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీఎం అజయ్‌నాయక్, ఆర్ఐ అజీజ్ ఉన్నీసా, కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతులు సైదులు, వెంకన్న, హామలీలు, తదితరులు పాల్గొన్నారు.

మునగాల: మండలపరిధిలోని నేలమర్రి, నర్సింహులగూడెం గ్రామాల్లో శనివారం తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు,ఎంపీడీఓ రమేష్ దీన్ దయాళ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వానాకాలంలో రైతులు పండించిన వరిధాన్యాన్ని ఐకేపీకేంద్రాల్లో విక్రయించుకుని ప్రభుత్వం అందించే మద్దతు ధరలు పొందాలని సూచించారు.సన్న రకం ధాన్యాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ దీన్ దయాల్,సీసీ, ఎంఈఓ, సీఏఫ్, వీఓఏస్, వీఓఓబీలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర మరువలేనిది

- వ్యవసాయ కార్మిక సంఘం మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ

నవతెలంగాణ-సూర్యాపేట



భారత వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర గణనీయంగా ఉందని మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పాని పద్మ అన్నారు. శనివారం స్థానిక మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన జిల్లా మహిళా కూలీల జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు కనీస వేతనం చట్టం ప్రకారం అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కూలీల మహిళల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వివరిస్తున్నాయని ఆరోపించారు. ప్రమాదలో చనిపోయిన మహిళ వ్యవసాయ కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్గ్రేజ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహిళ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్‌గా జంపాల స్వరాజ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, సోమపంగా జానయ్య, ఆరేరామకృష్ణారెడ్డి, ఉప్పలయ్య, వనం సోమయ్య, ఉయ్యాల పారిజాత, అండం వెంకటమ్మ తురక నాగమ్మ, కొండ భవాని, దారా ధనలక్ష్మి, అంజపల్లి పద్మ, నందిపల్లి పూలమ్మ, రెడ్డి మల్ల ఇందిర పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించిన సంఘం డైరెక్టర్లు

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్



ప్రాథమిక వ్యవసాయసంఘం పరిధిలోని శనివారం లింగగిరి, శ్రీనివాసాపురం రెండు సెంటర్లలో తహసీల్దార్ కె.నాగేందర్‌తో కలిసి సంఘం అధ్యక్షులు కట్ట గోపాల్‌రావు, సంఘం డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు.రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను అమ్ముకొని గ్రేడ్ ఏ ధాన్యాన్ని రూ.2320, సాధారణ ధాన్యం గ్రేడ్‌బీ రూ.2300తో పాటు సన్నరకానికి క్వింటాకు 500 రూపాయలు బోనస్ ప్రభుత్వం అందజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.నాగేందర్, సంఘం అధ్యక్షులు కట్ట గోపాల్‌రావు, సంఘం డైరెక్టర్లు శీలం నర్సింహారావు, తోట వీరస్వామి, సాముల నర్సిరెడ్డి, కొనగంటి కోటిరెడ్డి, సంఘం సెక్రెటరీ ఎం.జనార్దన్‌రావు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన అగ్రిమెంట్ కోసం రైస్ మిల్లర్స్ యాజమాన్యం ముందుకు రావాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రైస్ మిల్లులో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు అలవెన్స్ నూతన అగ్రిమెంట్ కొరకు రైస్ మిల్లర్స్ యజమాన్యం ముందుకు రావాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గం అధ్యక్షులు బెల్లంకొండ గురువయ్య సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను,బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షులు పచ్చిపాల ఉపేందర్ కోరారు. శనివారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి నరసింహారావు నాయకులు గజ్జి ప్రభాకర్‌కు వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రతిరెండేండ్లకోసారి డ్రైవర్స్ యూనియన్, కార్మికుల వేతనాల అలవెన్స్ పెంపులు ఉంటాయన్నారు.ఈసారి కూడా వేతనాల పెంపు కోసం యాజమాన్యం సహకరించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను అలవెన్స్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చింతకాయల రాము నాయకులు చలికంటి జానయ్య చలువాది సైదులు పర్వతాలు ఎర్రయ్య, ఎం వీరబాబు, తిరుపతయ్య, లాలయ్య, బాలకృష్ణ ,రమేష్ ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-కోదాడటౌన్



కాంగ్రెస్ బలోపేతానికి తొలినుంచి సేవలందించే వారికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలు న్యాయం చేస్తున్నారని మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. శనివారం వారి నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావుకు జిల్లా గ్రంథాలయ చైర్మెన్‌గా నియామకమైన సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి వారిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రామారావు మొదటి నుంచి పార్టీ కోసం నిరంతరం కృషి చేశాడని వారి సేవలను గుర్తించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి న్యాయం చేశారని కొనియాడారు. గ్రంథాలయ చైర్మెన్‌గా జిల్లాలో ఉన్న అన్ని గ్రంథాలయాలతో పాటు కోదాడ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు.భవిష్యత్‌లో మరెన్నో ఉన్నతమైన పదవులను అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వంటిపులి వెంకటేష్, చందు నాగేశ్వరరావు, నెమ్మాది దేవమణి, లైటింగ్ ప్రసాద్,కాజా మోహినిద్దీన్, వేలాద్రి, సైదిబాబు,వేమూరి విద్యాసాగర్,మైలారి శెట్టి భాస్కర్,ముస్తఫా, వంటి పులి శ్రీను, మేకపోతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు

నవతెలంగాణ-తుంగతుర్తి



రైతుల సంక్షేమమే లక్ష్యంగా, ప్రజా అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని వెలుగుపల్లి, దేవునిగుట్టతండ, వెంపటి, గొట్టిపర్తి, కొత్తగూడెం, గానుగుబండ, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ఈ మేరకు రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి. దయానంద్, ఎంపీడీవో శేషు కుమార్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గోవింద్,ా ంవిన్యూ ఇన్‌స్పెక్టర్లు రవీందర్ రెడ్డి,శ్రీనివాస్,ఏఈఓలు సాయి శ్రీజన, జోష్ను, మహితా రెడ్డి,సీసీ గడ్డం గిరి,ఇన్చార్జి సిసి నర్సింగ్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, తిరుమలప్రగడ కిషన్ రావు,ఆయా గ్రామాల కార్యదర్శులు, సంఘ బంధం సభ్యులు, వివోఏలు, పాల్గొన్నారు.



వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిదిలోని 8వ వార్డ్ యందు నిర్వహించిన జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ చైర్మెన్ శాగంటి అనసూయ రాములు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఆరోగ్య సిబ్బంది నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని, డాక్టర్లు అందించే సలహాలు, సూచనలు పాటించి ప్రభుత్వ ఆసుపత్రిలో సహజ కాన్పు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, కలమ్మ, బేబి, ధనమ్మ, దాసరమ్మ, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్ సత్తా చాటిన తేజ విద్యాలయ విద్యార్థి

- శ్రీహరికోటను సందర్శించనున్న హర్షవర్ధన్

నవతెలంగాణ-కోదాడరూరల్



జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్ 2024 లో పట్టణానికి చెందిన తేజ విద్యాలయ విద్యార్థి హర్షవర్ధన్ సత్తా చాటాడని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.భారత అంతరిక్ష పరిశోధనసంస్థ భారత కేంద్ర శాస్త్రసాంకేతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినంగా జరుపుకునే ఆగష్టు 23వ తేదీని పురస్కరించుకుని దేశ స్థాయిలో విద్యార్థులకు జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్ –2024 పేరున పోటీ నిర్వహించారు.10 ఆగష్టు 2024 నుంచి 30 సెప్టెంబర్ 2024 వరకు పోటీ నిర్వహించారన్నారు.ఈ పోటీలో మొత్తం దేశ వ్యాప్తంగా 3,66,308 మంది పాల్గొన్నారు.అందులో మొదటి 100 (వంద) మందిని ఎంపిక చేసి వారికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వారు (ఇస్రో) ప్రసిద్ధ అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రం , శ్రీహరి కోటను సందర్శించే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు.ఈ పోటీలలో కోదాడకు చెందిన తేజ విద్యాలయ విద్యార్థులు (200) మంది పాల్గొన్నారు. వీరిలో 7వ తరగతి చదువుతున్న గుజ్జుల హర్షవర్ధన్‌రెడ్డి మొదటి వంద మందిలో నిలిచి అక్టోబర్ 23వ తేదిన శ్రీహరికోటను సందర్శించే బృందంలో స్థానం సాధించాడని తెలిపారు. హర్షవర్ధన్‌రెడ్డికి ఈనెల 23న శ్రీహరికోటను సందర్శించే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థితో పాటు సంరక్షకునిగా అధ్యాపకుడు కిషోర్‌రెడ్డి కూడా వెళ్లడం జరుగుతుందని తెలిపారు.అనంతరం విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డిని అభినందించారు.

సీనియర్ సివిల్ జడ్జిగా సుర సుమలత

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి గా నిర్వహించిన డాక్టర్ సూర సుమలత , సీనియర్ సివిల్ జడ్జి గా ప్రమోషన్ పొంది, భాద్యతలు స్వీకరించారు.మూడేండ్లుగా విధులు నిర్వహిస్తున్న తనకు అందరి సహకారం లభించిందన్నారు.భాద్యతలు నిజాయతీగా, నిర్భయంగా, నిబద్ధతతో నిర్వర్తిస్తా నన్నారు.ఆలేరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు ఆమెను శాలువాతో సన్మానించడంతో మెమో ంటో అందజేశారు.ఈ కార్యక్ర మంలో బార్ సోసియేషన్ అధ్యక్షులు జూకంటి రవీందర్, మాజీ అధ్యక్షులు రావుల రవీందర్‌రెడ్డి, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులోని విద్యుత్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న విద్యుత్తు ఉద్యోగులు, లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్తున్న వారిని శనివారం ఏఈ రాజుల సతీశ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్స్ సప్పిడి వెంకట్‌రెడ్డి, అనూష, విద్యుత్ సిబ్బంది కనుక సత్తిరెడ్డి, కొలను కృష్ణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, సత్యనారాయణ, మహేశ్ పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-వలిగొండ

పట్టణానికి కేంద్రానికి చెందిన గుంజ చిన్ననర్సింహ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు.మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు ఐటిపాముల రవీంద్ర పరామర్శించి వారి కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో రచ్చ శ్రీను, రాచమల్ల తిరుపతయ్య, గొలుసుల దుర్గ, పిట్టలశంకర్, నాగేల్లి కృష్ణ, గొలుసుల కనకయ్య, గుంజ మహేష్, వరికుప్పల మురళి తదితరులు పాల్గొన్నారు.

అర్జున్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని బోగారం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు గంట్యాల అర్జున్ (35) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గోశిక వెంకటేశ్వర్లు అర్జున్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కోడి పాండు, జెళ్ళ దత్తాద్రి, రాపోలు బలరాం, రచ్చ ఆనంద్, దోర్నాల రాములు, గుర్రం భిక్షపతి, గోగు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు సుదర్శన్ పై దాడి చేసిన దుండగులను శిక్షించాలి


నవతెలంగాణ-ఆలేరుటౌన్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జర్నలిస్టు నిట్ట సుదర్శన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దుండగులను గుర్తించి కఠిన ంగా శిక్షించాలని, ఆలేరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు మహ్మద్ ఖుర్షీద్‌పాషా అన్నారు.మండలకేంద్రంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో కాపు కాసి,విచక్షణా రహితంగా కొట్టారని,అతని పరిస్థితి విషమంగా ఉందన్నారు.ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలని,దోషులు ఎంతటి వారైనా వెంటనే అరెస్టు చేసి,చట్ట ప్రకారం శిక్షించాలన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పి.మాధవరెడ్డి, గుండు మధు, మహేందర్, ముల్లెక్కల రవి, కోరుటూరు ఉపేందర్,సిరిగిరి స్వామి, కూళ్ళ సిద్దులు, చింతకింది వెంకటేష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్ సమస్యలను పరిష్కరిస్తాం :ఎమ్మెల్యే

నవతెలంగాణ-భువనగిరి



ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు శనివారం భువనగిరి హైదరాబాద్ చౌరస్తాలోని జై భీమ్ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు.ఈ కార్యక్రమములో మా సొసైటీ గౌరవ అధ్యక్షులు పోత్నక్‌ప్రమోద్‌కుమార్, మున్సిపల్‌చైర్మెన్ పోతంశెట్టి వెంక టేశ్వర్లు, వైస్‌చైర్మెన్ మాయ దశరద, స్థానిక కౌన్సిలర్లు సలావుద్దీన్ (27వ వార్డు), రత్నాపురం బలరాం, మా సొసైటీ అధ్యక్షులు గాయపాక పరమేశ్వర్, సొసైటీ ఉపాధ్యక్షులు తూముకుంట వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి సంతోష్ కుమార్, సహాయకార్యదర్శి కట్లకిషన్, కోశాధికారి పాదం రమేశ్, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైన రాజపేట విద్యార్థులు

నవతెలంగాణ-రాజపేట

జిల్లాస్థాయి వివిధ క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి నల్లగొండ జిల్లా సాయివాలీబాల్ పోటీలకు ఎన్నికయ్యారని ఎంఈఓ చందా రమేష్ తెలిపారు. శనివారం ఆయన వివరాలు చెప్పారు. వాలీబాల్ పోటీలో బొందుగుల ఉన్నత పాఠశాలకు చెందిన లోకేష్, రాజపేట గురుకుల పాఠశాలకు చెందిన అనిల్, 14 సంవత్సరాల లోపు విభాగంలో గురుకుల పాఠశాలకు చెందిన చరణ్ ఎంపిక కాగా, పాముకుంట ఉన్నత పాఠశాలకు చెందిన సాహితీ 17 ఏండ్లలోపు విభాగంలో ఎంపిక కాగా, పాముకుంట ఉన్నత పాఠశాలకు చెందిన పరమేశ్వరి కూడా ఎంపికైనట్లు వివరించారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాజీవ్ ట్రస్ట్ కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఏ ఖయ్యూం శనివారం అన్నారు.చౌటుప్పల్ మండలం నేలపట్ల తాళ్లసింగారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాజీవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాముల లోకేశ్వరి బత్తుల నర్సింహాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ గుండు మల్లయ్యగౌడ్,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ రాజీవ్ ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నల్ల నరసింహ, గ్రామ శాఖ అధ్యక్షులు పాలమాకుల నరసింహ, దొనకొండ కృష్ణ,మాజీ ఉపసర్పంచులు పాలమాకుల యాదయ్య, తడక వెంకటేశం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొడెం రాములు,మహేష్‌గౌడ్, చౌట లింగంగౌడ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆలేరుటౌన్

బాల్య వివాహాలు నిర్మూలించాలని, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని కోరుతూ ఆలేరు మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ రజినీకర్, చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యులు హరిబాబు, స్వప్న, నందిని, సురేష్, కళాశాల సీనియర్ ఆధ్యాపకులు రవీందర్, ఎన్ఎంఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జూకంటి వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాయిదామంలో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని పెద్దపర్వతాపురం గ్రామంలో గల సాయిధామలో శనివారం రోటరీ క్లబ్ అఫ్ భువనగిరి సెంట్రల్, సుమంత్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.కంటిపరీక్షల శిబిరాన్ని సాయిదామం ఆశ్రమం పీఠాధిపతులుశ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానందప్రభుజీ, శ్రీ సాయి సేవాసమితి ట్రస్ట్ ఇన్‌చార్జి మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ జి. చంద్రారెడ్డి, మాజీ అధ్యక్షులు గడ్డం జ్ఞానప్రకాష్‌రెడ్డి, కలిసి ప్రారంభించారు.శ్రీ సాయి విద్యాదామం హైస్కూల్‌లో మొత్తం 75 మంది విద్యార్థులను పరీక్షించగా10 విద్యార్థిని విద్యార్థులకు కళ్ళజోళ్ళు అవసరం పడతాయని నిర్ధారించినైనది. కళ్ళజోళ్ళు సద్ది వెంకట్‌రెడ్డి త్వరలో అందజేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమంత్‌రెడ్డి, ఎస్పీఉపేందర్‌రావు, రోటరీ క్యాంపు కోఆర్డినేటర్, సుమంత్ కంటి ఆస్పత్రి సిబ్బంది కె. రాజేష్, హైస్కూల్ హెడ్మాస్టర్ ఉన్నారు.



రైతులకు రైతు భరోసా ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

నవతెలంగాణ-ఆత్మకూర్‌ఎం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని,తెలంగాణలో ఉన్న కోటి యాభైముడు వేల ఎకరాల సాగుకు నేటికి రైతు బరోసా (రైతుబంధు) అందలేదని,తక్షణమే రైతులకు రైతు బరోసా ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం మండలకేంద్రంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్‌లో ఆపార్టీ ఎనిమిదవ మండల మహాసభ అమరవీరుల నగర్ లో నిర్వహించారు.మహాసభకు ముందు మండలకేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో 11,475 వేల కోట్ల రూపాయలు రైతు బరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్ష కాలం లో రైతులు పండించిన పంటను తక్షణమే కొనుగోలు చేయాలని, వెంటనే ధాన్యం కొనుగోలుసెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాట్లాడుతూ మండలంలోని బునదిగాని కాలువ, భీమలింగం కాలువల పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. బునాదిగాని కాలువ పనులకోసం బడ్జెట్‌లో రూ.266 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు.కాలాయపన చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బోలగాని జయరాములు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైళ్ళ యాదిరెడ్డి మండల కార్యదర్శి వేముల భిక్షం, ఎ పి ఎస్ ఎం జిల్లా కార్యదర్శి ముత్యాలు మండల నాయకులు రచ్చ గోవర్ధన్,గోపాల్‌రెడ్డి, గుణమోని స్వామి, రాచమల్ల సత్తయ్య,తుమ్మల సత్యనారాయణరెడ్డి, తుమ్మలగూడెం యాదయ్య, మల్లెల శ్రీశైలం, భాషబోయిన బుగ్గయ్యనాయిని రాంరెడ్డి, చెరుకు మల్లేశం, మరిపెల్లి మల్లయ్య, భిక్షపతి, భారతమ్మ, నర్సమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సివిల్‌జడ్జి కోర్టును ప్రారంభించిన న్యాయమూర్తులు

- హైకోర్టు న్యాయమూర్తులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికిన బార్ అసోసియేషన్

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలకేంద్రంలోని కోర్టు ఆవరణలో నూతనంగా మంజూరైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టును తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జువ్వాడి శ్రీదేవి, కూనూరు లక్ష్మణ్, కలెక్టర్ హనుమంత్ కే.జెండగే శనివారం ప్రారంభించారు.అంతకుముందు పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య వారికి పండితులు, న్యాయవాదులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ప్రారంభించిన అనంతరం పోటు భవనాన్ని పరిశీలించారు.అనంతరం మండలకేంద్రంలోని కొమ్మాయి గూడెం రోడ్డులో కోర్టుల నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి జడ్జి జి. సంపూర్ణఆనంద్, సీనియర్ సివిల్ జడ్జి మాధవి లత, జూనియర్ సివిల్ జడ్జి ఏ ప్రదీప్, ఎస్ చందన, మహతి వైష్ణవి, కవిత, డీసీపీ రాజేష్ చంద్ర, చౌటుప్పల్ ఏసిపి పటోళ్ల మధుసూదన్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీవో భూక్యా యాకూబ్‌నాయక్, సీఐ నిగిడాల వెంకటేశ్వర్లు, గవర్నమెంట్ ప్లీడర్ మక్తాల నర్సింహ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్, సీనియర్ న్యాయవాదులు యాపాల కృష్ణారెడ్డి, కంపాటి యాదగిరి, పరంకుషం అశోక్‌కుమార్, జినుకల ప్రభాకర్, ఉయ్యాల హనుమంతు గౌడ్, పంతుల శోభన్ బాబు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కేమ రామదాసు, లింగయ్య సత్తయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, సుక్క శ్రవణ్‌కుమార్, బి.అశోక్ కుమార్, నకిరెకంటి మొగులయ్య, బర్ల డేవిడ్, పాల్వంచ జగత్, యాదాసు యాదయ్య, భువనగిరి బార్ ప్రెసిడెంట్ బబ్బూరి హరినాథ్, ఆలేరు బార్ ప్రెసిడెంట్ జూకంటి రవీందర్, శ్రీశైలం, దినేష్, రమేశ్, సూపరింటెండెంట్లు గంగాభవాని, శివరాజు తదితరులు పాల్గొన్నారు.



స్పీడ్ బ్రేకర్లను వెంటనే ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట పట్టణంలో గత ప్రభుత్వం అనాలోచితంగా నిర్మాణం చేసిన పాతగుట్ట చౌరస్తా నుండి నిర్మాణం చేసిన బ్రిడ్జ్ తొలగించాలని, అప్పటివరకు బిడ్జి పక్కన సర్వీస్ రోడ్లపై అండర్ బైపాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు బబ్బురి శ్రీధర్, మండల సహయ కార్యదర్శి పేరబోయిన మహెందర్ కోరారు. ఆపార్టీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఉన్న రోడ్డు భవనాల శాఖ ఈఈకి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బిడ్జితో పట్టణ ప్రజలు, భక్తులు ప్రాణాపాయ సంఘ టనలకు గురవుతున్నారని తెలిపారు. పాత గుట్ట చౌరస్తా వద్ద గతంలో సర్కిల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పి సర్కిల్‌ను ఏర్పాటు చేయకపోవడం బోర్డులను అడ్డం పెట్టడం ద్వారా స్థానిక ప్రజలు భక్తులు ఎలా వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నా రన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గోపగానిరాజు, మండల సమితి నాయకులు మాటూరి మల్ల య్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు కంబాల వెంకటేష్, పట్టణ సహకారదర్శి పోన్నబోయిన వెంకటేష్, శెట్టి మధు పాల్గొన్నారు.



శ్రీ గణేష్ మోటార్స్..
దీపావళి సేల్స్ కార్నివాల్‌ను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలంలోని ఎస్‌బీఐ బ్యాంకు ప్రక్కన శ్రీ గణేష్ మోటార్స్ ఆలేరు వారి దీపావళి సేల్స్ కార్నివాల్‌న్ను వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై నాగుల ఉపేందర్‌యాదవ్ తెలిపారు. శనివారం సేల్స్ కార్నివాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 19-10-24 నుండి 21-10-24 వరకు ఈ 3 రోజులు రాజాపేట లో అందుబాటులో ఉంటుందని యాజమాన్యం నిర్వాహకులు భీమ్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తెలిపారు. సరసమైన ధరలకు దీపావళి కానుక సందర్భంగా (బాడీ కవర్, హెల్మెంట్ ం5 లీటర్స్ పెట్రోల్ ఉచితంగా పొందాలని తెలిపారు.ఈ సేల్స్ కార్నివాల్‌లో Glamour రూ.3000, Passion plus రూ.3000, Scooter రూ.3000 ఎన్నడూ లేని విధంగా డిస్కౌంట్ పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆడెపు శ్రీశైలం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, నేమిల కేదార్‌గౌడ్, ఊట్కూరి అశోక్‌గౌడ్ , మోత్కుపల్లిప్రవీణ్ ,రేగు సిద్దులు, జస్వంత్, లక్ష్మణ్, జర్నలిస్టులు వార్త రమేష్ , బిర్రు బాలకిషన్, చీర మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) బొమ్మలరామారం మండల కార్యదర్శిగా రాక్యల శ్రీశైలం

నవతెలంగాణ-బొమ్మలరామారం

సీపీఐ(ఎం) ఎనిమిదవ మండల మహాసభలో నూతన కమిటీ 9 మందితో నూతన కార్యదర్శిగా మర్యాల గ్రామానికి చెందిన రాక్యల శ్రీశైలంను మూడోసారి మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, జిల్లా వర్గ సభ్యులు దాసరి పాండు మాట్లాడారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ప్రజలతో చర్చించి ఉద్యమాలు నిర్వహి ంచడంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజా సంఘాలను బలోపేతం చేసి ప్రజా పునాది పెంచుకుంటామన్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో అమ్ముకునేందుకు కొనుగోలుకేంద్రాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారని, ఏండ్ల తరబడి సొంతగూడు లేక అద్దె భవనాలలో ఉంటూ పత్రికా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టు లందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. గ్రామాలలో ప్రజాపాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటు చేసే ఇందిరమ్మ కమిటీలలో అన్ని రాజకీయ పార్టీలకు ప్రాతినిత్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ బ్రహ్మచారి, సల్లూరి కుమారు, సాయికుమార్, సాయిలు, రవి, వెంకటేశం, పున్నమ్మ, యాదయ్య, కేంసారంభిక్షపతి, మైలారం లక్ష్మయ్య, స్వామి, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

భువనగిరి మండలంలోని అనాజిపూర్ జీఎస్‌పీ గార్డెన్‌లో కాటమయ్య రక్షణ కవచాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభంఅనిల్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గీత కార్మికుల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాల కిట్లును ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. గీత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన లైన్‌మెన్లు

నవతెలంగాణ-అడ్డగూడూరు

అడ్డగూడూరు లైన్‌మెన్‌గా ఎస్.కె ఖాజా,గట్టుసింగారం, మానా యకుంట గ్రామాల లైన్‌మన్‌గా ఉపేంద్రా చారి, చౌళ్లరామారం లైన్‌మెన్‌గా సురేందర్‌రెడ్డి శనివారం బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన లైన్‌మెన్లు మాట్లాడుతూ ఉన్నతాఅధికారుల సూచ నలతో, మండల అధికారుల సమన్వయంతో గ్రామ ప్రజల సహకారంతో విద్యుత్ అంతరాయం లేకుండా మా వంతు సేవలు అందించడానికి ఎల్ల వేళలా కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు విద్యుత్తు ఉద్యోగులు లైన్ మెన్లుగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్రాచారి, ఎస్కే ఖాజా, సురేందర్‌రెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్డగూడూరు ఏఈ ఉమా, విద్యుత్ ఉద్యోగులు నాగులపల్లి లక్ష్మణ్, మారిశెట్టి అశోక్, తుప్పతి బీరప్ప, నూకల నరసింహ, సురేందర్, మురళీ, సుదర్శన్, వెంకన్న, రామాచారి పాల్గొన్నారు.



ఆత్మకూర్‌ఎం సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా వేముల భిక్షం

నవతెలంగాణ-ఆత్మకూరుఎం

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా వేముల భిక్షం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శనివారం మండలకేంద్రంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆపార్టీ మండల8వ మహాసభలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలకమిటీ సభ్యులుగా రచ్చ గోవర్ధన్, రాచమల్ల సత్తయ్య గుణబోయిన స్వామి, నాయినికృష్ణారెడ్డి, తుమ్మలగూడెం యాదయ్య మల్లెల శ్రీశైలం తో పాటు పార్టీ మండలకోఆప్షన్ సభ్యురాలుసంఘపాక అరుణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వేముల భిక్షం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లోని ప్రజా సమస్యలను గుర్తించి, ప్రజలను చైతన్యవంతులను చేస్తూ సమస్యలకు పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు.బునాదిగాని కాల్వ పనులు పూర్తి, గోదావరి నీళ్ల సాధించేవరకు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను కొనసాగిస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.



జైభీమ్ ఆటో యూనియన్‌లో ఉపసంఘాలు లేవు

నవతెలంగాణ-భువనగిరి

జై భీమ్ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీలో ఎటువంటి ఉపసంఘాలు లేవని సొసైటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గూడా నర్సింగరావు అన్నారు.శనివారం భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో జై భీమ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో సొసైటీ అధ్యక్షునిగా పనిచేసిన వ్యక్తి కొంతమంది ఆటోరంగానికి సంబంధం లేని కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారని ఆరోపించారు.కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని సొసైటీ ఏర్పాటు చేసు కున్నట్లుగా కార్యక్రమం చేసి తప్పుదోవ పట్టించారన్నారు. ఈ విషయంపై జిల్లా సొసైటీల రిజిస్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.నిబంధనను ఉల్లంఘించిన కాయపాక పరమేశ్‌ను సొసైటీ నుండి బహిష్కరించామన్నారు.ఈ సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కొమ్ము జగదీష్‌బాబు, కోశాధికారి శ్రీనివాస్, నాయకులు ఎండి సిద్దిక్, యాటమధు, పి.దశరథ, వినయ్, పరకాల నరేష్, మంద వెంకటేష్, బక్కన ఉప్పలయ్య, మాటూరి నాగరాజు, నగేష్, శ్యామల రఘుపతి, పొట్టనరేష్, బసాని నవీన్, మోసిన్,ఎస్‌కె.నిజాం పాల్గొన్నారు.

విద్యా కమిషన్ సలహాదారులుగా ఆర్.వెంకట్‌రెడ్డి నియామకం

- హర్షం వ్యక్తం చేసిన ప్రజాసంఘాలు

నవతెలంగాణ-భువనగిరి

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల విద్యాహక్కు పరిరక్షణ, బాల్య వివాహాల సాంప్రదాయానికి వ్యతిరేకంగా ఉద్యమనిర్మాణంలో ంండు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న ఎం.వి.ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డిని తెలంగాణా రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులుగా నియామకం పట్ల జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ కమిటీల సభ్యులు ఎర్ర శివరాజ్ కొడాలి వెంకటేష్, ప్రకటనలో పలు అంశాలను ప్రస్తావించారు.ఆర్.వెంకట్ రెడ్డి పిల్లల విద్య కోసం తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలో స్వచ్ఛంద సంస్థలతో అంతర్జా తీయంగా "స్టాప్ చైల్డ్ లేబర్ కాంపెయిన్' భాగస్వామ్య దేశాలైన ఉగాండా, కెన్యా, ఇథియోపియా, ఘన, మాలి, మొరాకో తదితర దేశాల్లో ఆయన పని చేశారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో రాష్ట్రంలోని సామాజిక కార్యకర్తలను ఒక వేదికగా ఏర్పాటు చేసి చురుకైన పాత్ర పోషించారన్నారు. బాలల పక్షపాతిగా ఉంటూ నాణ్యమైన విద్య పిల్లల హక్కు అని, పిల్లలు మన జాతీయ సంపద అంటూ , నిరంతరం పిల్లల కోసం పనిచేస్తున్న ఆర్. వెంకట్‌రెడ్డి సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్ సలహాదారులుగా నియమించిదన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో ఆవుల వినోద్ కుమార్, బొక్క రాంబాయి, వగ్గు క్రిస్టోఫర్, పురుషోత్తం హర్షం వ్యక్తం చేశారు.



ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకొని జాతీయవాదులకు మద్దతుగా నిలవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు.ఆలేరు మండలకేంద్రంలో శనివారం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల తదితర పాఠశాలలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుటకు 1)దరఖాస్తు ఫామ్.19.....2) సర్వీస్ సర్టిఫికెట్ పైన ప్రధానోపాధ్యాయులు /ప్రిన్సి పాల్ సంతకం చేసిన కాపీ 3)ఓటరు ఐడి, 4).ఆధార్ కార్డ్, 5) పాస్పోర్ట్ సైజ్ ఫొటో ఉండాలన్నారు. 2019 లో ఉన్న ఓటర్ జాబితా పూర్తిగా రద్దయినందున ప్రతి ఒక్కరూ మళ్ళీ నమోదు చేసుకోవాల్సిందేనని తెలిపారు.నమోదుకు నవంబర్ ఆరవ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు కాపాడబడాలంటే జాతీయవాదులకు అండగా నిలిచి కౌన్సిల్‌కు పంపాలని కోరారు.ఈ కార్యక్రమంలో తపస్ బాధ్యులు దూడల వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు దాసరి మంజుల, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నరేంద్రస్వామి, సైదులు మేగరాజు, రేష్మ, సత్యనారాయణ, పరమేష్, మల్లేశం, రోహిణి, రాధిక, హేమలత, జ్ఞాన ప్రసూన, సుజారాణి, శ్రీధర్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలంలో పీఏసీఎస్,ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుంకుడుపాముల, ఎన్నారం, పల్లివాడ, మునిపంపుల, దుబ్బాక, రామన్నపేట,నిదాన్‌పల్లి, ఇంద్రపాలనగరం, సిరిపురం, వెల్లంకి గ్రామాలలో ధాన్యం కొనుగోలుకేంద్రాలను శనివారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ నంద్యాల భిక్షంరెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మెన్ అంబటి ఉపేంద్ర రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలఅధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు గంగుల వెంకట రాజారెడ్డి, తిమ్మాపురం మహేం దర్‌రెడ్డి, పూస బాలకిషన్,గుత్తా నర్సింహారెడ్డి, అప్పం లక్ష్మీనర్సు, బొక్క పురుషోత్తంరెడ్డి, ఎండి జమీరోద్దీన్, గోదాస్ పృథ్వీరాజ్, కూనూరు సాయికుమార్‌గౌడ్, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



భువనగిరికలెక్టరేట్ :భువనగిరి మండలంలోని ఆకుతోట బావి తండా, సూరేపల్లి, నందనం, అనాజిపురం, బొల్లేపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలోఐకేపీ ఏపీఎం అంజయ్య, మాజీ ఎంపీపీ నారాల నిర్మల వెంకటస్వామియాదవ్, మాజీ ఎంపీటీసీ గడ్డమీద చంద్రకళ వీరస్వామి, గోదా మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఏదునూరి ప్రేమలత మల్లేశం, మాజీ ఎంపీటీసీ గోనుగుంట్ల కల్పన శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కానుకుంట్ల బాబురావు, కానుకుంట్ల కొండల్, తాళ్లపల్లి బాలకృష్ణ గణేష్, బాలస్వామి, అశోక్‌రెడ్డి,పార్టీ మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేశం , రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికే పరిమితం

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

ధాన్యం కొనుగోలుకేంద్రాలను ప్రారంభానికే పరిమితం చేశారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు కోట రామచంద్రారెడ్డి,ప్రసాదంవిష్ణు విమర్శించారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండలకార్యదర్శివర్గ సమావేశంలో వారు మాట్లాడారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభానికి పరిమితం చేశారని, రైతాంగం సుమారు 60 నుంచి 70 శాతం వరకు పూర్తిగా వరిధాన్యాన్ని తీసుకొచ్చి మార్కెట్‌యార్డులో పోశారన్నారు.పోసిన ధాన్యానికే ఇప్పటికే మార్కెట్‌యార్డులు ధాన్యంతో నిండి పోయాయని తెలిపారు.ఇంకా 30శాతం వరి ధాన్యం తీసుకువస్తే పోసేందుకు వీల్లేకుండా మార్కెట్ యార్డులు నిండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే అధికారులు స్పందించి మార్కెట్‌యార్డులో ఉన్న ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలన్నారు. స్థలం లేక తెచ్చిన ధాన్యాన్ని మొత్తం తక్కువ రేటుకు రైస్ మిల్లర్లకు అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మార్కెట్‌యార్డులో పోసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని కోరారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
ఆదివారం | అక్టోబర్ 20 , 2024 | www.navatelangana.com

మంచినీటి సహాయకులకు పూర్తయిన శిక్షణ

- సర్టిఫికెట్లు అందజేసినజెడ్పీ సీఈఓ శోభారాణి



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్
గ్రామ మంచినీటి సహాయకులకు భువనగిరి ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేసిన శిక్షణ శనివారం ముగిసింది. నాలుగవ రోజు శిక్షణ పూర్తికాగా, వారికి జెడ్పీ సీఈఓ ఎస్ శోభారాణి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ సీఈ జి.లలిత, మిషన్ భగీరథ డీఈఈ ప్రశాంత్‌కుమార్,గ్రిడ్ డీఈఈ అరుణ, భువనగిరి ఎంపీడీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈఈలు గుండురావు, శ్రీలత,ల్యాబ్ సిబ్బంది ఝాన్సీరాణి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో, కబడ్డీ పోటీల్లో ఎంజీయూకు ప్రాతినిధ్యం కోసం ఎంపికలు

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి
అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో ఎంజీయూకు ప్రాతినిధ్యం వహించే జట్ల ఎంపికలు ఈ నెల 22, 23న నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ సెక్రెటరీ డా హరీష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న తైక్వాండో ఎంపికలు, 23న కబడ్డీ ఎంపికలు జరగనున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జరగనున్న ఎంపికల్లో 17 నుండి 25 సంవత్సరాల లోపు డిగ్రీ , పీజీ విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులు అని పేర్కొన్నారు.

మూసీ ప్రక్షాళనకు సహకరించాలి

- విద్యుత్ లోఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం
- మూసి కాలువలకు 500 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-భువనగిరి
మూసీ ప్రక్షాళనకు ప్రతిపక్షాలు సహకరించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 'నివారం భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ నీటితో కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్టులు, జిట్టా బాలకృష్ణారెడ్డి, ఇతర పార్టీలు మూసీ ప్రక్షాళన కోసం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేగంగా పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. నాడు ధర్నా చేసిన బీజేపీ నేడు అడ్డుకుంటామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.కేంద్రం నుండి నిధులు తెప్పించి మూసీ ప్రక్షాళన చేయించాల్సింది పోయి అడ్డుకోవడం బాధాకరమన్నారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే ఊరుకునేది లేదన్నారు. మూసీ ప్రక్షాళనతో భూగర్భ జలాలు మంచినీటి జలాలుగా మారుతాయన్నారు. ఇక్కడ పండే పంటలు, కూరగాయలు, చేపలు కలుషితమవుతున్నాయని, మూసి ప్రక్షాళన తర్వాత ఆ పంటలు స్వచ్ఛత ఉంటాయన్నారు. స్థానిక గ్రామాలతో పాటు హైదరాబాదుకు కూరగాయలు వెళ్తుతాయని అన్నారు. నాణ్యమైన పంటలు కూరగాయలు ఇస్తే వారికి లాభం చేకూరుతుందన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం ముందుగా 133 కేవీ సబ్ స్టేషన్ వలిగొండలో ఏర్పాటు చేయడం కు కృషి జరుగుతుందన్నారు. 33 కెవి సబ్‌స్టేషన్లు ఏడు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న బునాది గాని, పిలాయి పల్లి, ధర్మారెడ్డి కాలువలకు రూ.500 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. రూ.300 కోట్లతో రోడ్లు ఇతర సదుపాయాలకు నిధులు మంజూరు చేయించామన్నారు. జూలూరు బిడ్జి, బొల్లెపల్లి బ్రిడ్జిల పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసును కలిసి వివరించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేస్తామని చేయకపోగా విమర్శలు చేస్తున్నారని ఆలోచించారు. మూసీ ప్రక్షాళన కోసం ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలందరం కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. భువనగిరి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మూడు నెలల్లోగా పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ప్రమోద్‌కుమార్,మున్సిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేశ్వర్లు, అవేస్ చిస్తీ పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి

- ఎస్ఎఫ్ఐ నాగార్జునసాగర్ డివిజన్ కమిటీ



నవతెలంగాణ-హాలియా
అనుముల మండలం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్ మాట్లాడుతూ కళాశాల ప్రారంభమై సుమారు 5 నెలలు గడుస్తున్న విద్యార్థులకు మాథ్స్ మరియు బోటనీ బోధించడానికి ఉపాధ్యాయులు లేకపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. ఇంటర్ మొదటి , రెండవ సంవత్సరం విద్యార్థులు కలిపి ఎంపీసీ ,బైపీసీ చదువుతున్న విద్యార్థుల సంఖ్య 118 మంది ఉన్నారు. పేద మధ్య తరగతి చదువుకునే ప్రభుత్వ కళాశాలలో ఉపాధ్యాయల లోటు ఉంటే వాళ్ళు విద్యను ఎలా కొనసాగించాలన్నారు. వెంటనే మ్యాథ్స్, బోటనీకి ఉపాధ్యాయులని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల కార్యదర్శి ఆలేటి చెందు, హలీయ టౌన్ అధ్యక్షులు వర్షిత్, వరప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని వినతి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్
చండూర్ హైస్కూల్లో వంట చేసే తమపై అసభ్య పదజాలంతో దూషిస్తున్న ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు వంట చేసే మహిళలు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అదన కలెక్టర్ పూర్ణచంద్ర, డీఈఓ బిక్షపతి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ స్వాతిముత్యం మహిళా సమభావన సగం నుండి గత పది సంవత్సరాలుగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల కాలంలోనే తమను విధుల నుండి తొలగించి ఇతర ప్రయివేటు వ్యక్తులను నియమించురున్నాడని ఆరోపించారు. విషయంపై వివరణ అడగగా 'నాకు ఇష్టం వచ్చిన వారిని పెట్టుకుంటాను ఎవరికి చెప్పుకుంటారు చెప్పుకోమని' దుర్భాషలాడినట్లు తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు 400 మంది ఉంటే ప్రతి ఒక్కరికి ఎనిమిది రూపాయలు చొప్పున 30 రోజులకి ఒక రూ.1లక్ష పైచిలుకు డబ్బులు వస్తే మహిళా సంఘం అకౌంట్ లో జమ కాకుండా సదరు హెడ్మాస్టర్ తన సొంత అకౌంట్ లో వేసుకొని వారికి కేవలం 15 వేల రూపాయలు ఇస్తున్నారని ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఇతర హెడ్మాస్టర్ లు కూడా చేశారని, తన అకౌంట్లో డబ్బులు వేయించుకుంటూ మహిళా సంఘం అకౌంట్ లో డబ్బులు వేయకుండా వర్క్ కట్ చేసి డబ్బులు చెల్లిస్తున్నారని, ఇదేంటని అడిగిన వారిని విధ్రాల నుండి తొలగించి ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుంటున్నారని తెలిపారు. విషయంపై వెంటనే విచారణ జరిపి చర్యలు సంబంధిత హెడ్మాస్టర్ పై తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, నవదీప్, శేఖర్, కిరణ్, సంగం సెంట్రల్ కమిటీ సభ్యులు కిన్నెర జగదీష్, ఎం. యాదయ్య ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ అల్లంపల్లి కొండన్న, రాష్ట్ర కోఆర్డినేటర్ బాకీ తరుణ్, తదితరులు పాల్గొన్నారు.



పిల్లలను ఇతరులతో పోల్చకండి! నిందించకండి!

- బకాల్వాడి పేరెంట్స్ టీచర్స్ మీట్ లో..హెచ్ఎం

నవతెలంగాణ-మిర్యాలగూడ
పిల్లలు ఇంటి వద్ద పరీక్షలప్పుడు చదువుకునే సమయంలో ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసి, ఆరోగ్యం పట్ల ఆహారం పట్ల శ్రద్ధ తీసుకోవాలని బకాల్వావాడి పాఠశాలలో ఇవ్వాల జరిగిన పేరెంట్స్ టీచర్ సమావేశంలో హెచ్ఎం కరుణాకర్ రెడ్డి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఇంట్లో బడిలో పిల్లల్లో వస్తున్న మానసిక శారీరక మార్పులను గమనిస్తూ తల్లిదండ్రులు సరియైన సూచనలు చేయాలని కోరారు. ప్రతి నెల మూడో శనివారం పాఠశాలలో జరిగే తల్లిదండ్రుల సమావేశంలో భాగంగా ఇవాళ ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన వివిధ తరగతుల పిల్లల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం జరిగింది. లీగల్ లిటరసీ క్లబ్ ఇన్చార్జ్ సహోపాధ్యాయులు ప్రభాకర్ కస్తూరి మాట్లాడుతూ పిల్లల్ని ఇతర పిల్లల యొక్క ఫలితాలతో పోలుస్తూ నిందించకూడదని తల్లిదండ్రులుగా పిల్లల సమస్యలను గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఉన్న ఇంట్లో తల్లిదండ్రులు టీవీలో సీరియల్లు సెల్ ఫోన్లు చూస్తూ విద్యార్థుల చదువుకు భంగం కలగకుండా విద్యార్థుల్ని టీవీ సెల్ ఫోన్లు పట్ల జాగ్రత్త వహించేటట్లుగా చూసి మెరుగైన ఫలితాలు పొందటానికి ప్రశాంత వాతావరణంలో ఏర్పాటు చేయాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని వెంట వెంట ఫలితాలను తెలియజేయాలని డైరీ ఏర్పాటు చేయాలని మంచి నీళ్ల వసతి కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాలని పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో దాశివ,మక్లా నాయక్, జియావుద్దీన్ పద్మావతి శ్రీనివాస్ రెడ్డి ఉదయ శ్రీ వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులు తల్లిదండ్రులు సమావేశంలో పాల్గొన్నారు.

వెంకిర్యాలలో ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించాలి

- రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి



నవతెలంగాణ-బీబీనగర్
మండలంలోని వెంకిర్యాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని రైతుసంఘం జిల్లా సహాయకార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి గ్రామ శాఖ 9వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.దొడ్డు రకం వరి ధాన్యానికి కూడా 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు కుప్పలుగా రైతుల పోశారని అకాల వర్షానికి ధాన్యంరాశులు తాడిచే ప్రమాదం ఉన్నందున కొనుగోలు వెంటనే ప్రారంభించాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాల ప్రకారం వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్ను పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా ప్రతి మహిళకు 2500 రూపాయలు చెల్లించాలని కోరారు.మూసీజల కాలుష్యం నుండి ఈ ప్రాంత రైతాంగాన్ని ప్రజలను విముక్తి చేయాలని కోరారు. అనంతరం వెంకిర్యాల గ్రామ సీపీఐ(ఎం) నూతన కార్యదర్శిగా మాదారం శివకుమార్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు సయ్యద్ ఉమర్, చింతలసుబ్బారెడ్డి, పర్వతాలు, యాకరి లింగం, మేకల ఆంజనేయులు, రాజమణి, బర్ల సత్తమ్మ, చిలుగురాజు లక్ష్మణ్, మడుపునర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఉన్నత విద్యకు సూక్ష్మ స్థాయి పరిశీలన

- నైపుణ్యాల పెంపు, సారూప్యత ఉన్న విభాగాల సంఘటిత కార్యాచరణ
- ఎంజీయూ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన అచార్య అల్తాఫ్ హుస్సేన్



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి
మెరుగైన ఉన్నత విద్యకు సూక్ష్మ స్థాయి పరిశీలన ద్వారా, నైపుణ్యాల పెంపు కోసం కృషి చేయడంతో పాటు, సారూప్యత ఉన్న విభాగాల సంఘటిత కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఎంజీ యూనివర్సిటీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన నియామకాలు వాటి కూర్పు, విద్యా కమిషన్ ఏర్పాటు వంటి చర్యలు ఉన్నత విద్య పట్ల స్పష్టమైన వైఖరి దార్శనికతకు నిబద్ధతకు, నిదర్శనమన్నారు. రెండవ పర్యాయం నల్లగొండ ఎంజీయూ కు సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మెరుగైన ఉన్నత విద్యకు సూక్ష్మ స్థాయి పరిశీలన, సారూప్యత ఉన్న విభాగాల సంఘటిత కార్యాచరణ పరస్పర సహకారాలు , నైపుణ్యాభివృద్ధి అవసరమన్నారు. గతంలో ఇక్కడ సేవలందించిన దృష్ట్యా మరొక్క మారు అన్ని శాఖల అధికారులు అధ్యాపకులతో చర్చించి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలవాల రవి, ఓ ఎస్ డి ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, సిఓఈ డా ఉపేందర్ రెడ్డి, ప్రిన్సిపాళ్ళు అరుణప్రియ , మారం వెంకటరమణారెడ్డి , ప్రేమ్ సాగర్, సుధారాణి, అధికారులు మిరియాల రమేష్, దోమల రమేష్, అన్నపూర్ణ, రేఖ, రూప, వసంత, మాధురి, సబీనా హెరాల్డ్ తదితర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.



ఘనంగా చెరుకు లింగం గౌడ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మర్రిగూడ
బీఆర్ఎస్ జిల్లా నాయకులు,శివన్నగూడ మాజీ సర్పంచ్ చెరుకు లింగం గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని ఎల్ఎంజి కన్వెన్షన్ హాల్లో పార్టీలకతీతంగా పలు పార్టీల మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు ఆయన చేత కేక్ కట్ చేయించి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్,ప్యాక్స్ చైర్మెన్ పందుల యాదయ్య గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు పందుల రాములు గౌడ్, బీజేపీ నాయకులు వెన్నమనేని శ్రీనివాస్ రావు,ఎల్ఎంజి కన్వెన్షన్ హాల్ యజమాని లింగం గౌడ్,పత్రిక మిత్రులు కుక్కడపు ముత్యాలు, పల్లె యాదయ్య, కొంపల్లి నాగరాజు గౌడ్,గునిగంటి యాదయ్య,నాయకులు సుంకరి మల్లేష్ గౌడ్, కంబలపల్లి రాజేశ్వర్ రెడ్డి, లపంగి భిక్షం, హుస్సేన్, శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

నవతెలంగాణ-నకిరేకల్
ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మెన్ ఎల్.మధుబాబు పేర్కొన్నారు. శనివారం నకిరేకల్ ప్రెస్ క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ సవరణ ద్వారా చేయాల్సిన ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు ద్వారా తీర్పు ఇప్పించడాన్ని తీవ్రంగా ఖండించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో మనువాదాన్ని అమలు చేయాలని కుట్ర చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేయడం తగదన్నారు. ఆ ఆలోచనను వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ గా ముడుసు బిక్షపతి, కట్టంగూర్ మండల కన్వీనర్ గా గండమల్ల అంతయ్య, కేతేపల్లి కన్వీనర్ గా గాదరి రమేష్, నకిరేకల్ కన్వీనర్ గా బొప్పని అశోక్, నార్కట్ పల్లి కన్వీనర్ గా మహేశ్వరం కృష్ణ, చిట్యాల కన్వీనర్ గా దాసరి నరసింహ, రామన్నపేట కన్వీనర్ గా ఏలూరి వంశీలను నియమించారు. ఈ సమావేశంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ ముడుసు బిక్షపతి, జిల్లా కో కన్వీనర్లు అద్దంకి దయాకర్, చింతపల్లి బాలకృష్ణ సంద యాదగిరి, నామ చక్రవర్తి, అంగరాజు, స్వర్ణలత, ఎన్నమల్ల అనిల్, పరమేష్ పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-హుజూర్‌నగర్‌టౌన్
ఈనెల 21,22,23వ తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో జరిగే ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగేళ్ల వెంకటచంద్ర పిలుపునిచ్చారు.శనివారం అమరవీరుల స్మారక భవనంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయని విమర్శించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలలో మతోన్మాదంతో మహిళలు తినే ఆహారం మీద, కట్టుకునే బట్టల మీద, ఆచార వ్యవహారాల మీద ఆంక్షలు విధిస్తూ మహిళలను బానిసలుగా చూస్తున్నారని తెలిపారు. కేంద్రప్రభుత్వం మహిళా సాధికారికచట్టం చేయాలని డిమాండ్ చేశారు.పేద మహిళలందరికీ నెలకు రూ. 2500 ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిందని, అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఇచ్చిన హామీని అమలు చేసిన పాపాన పోలేదన్నారు. సామాజిక పింఛన్లు రూ.2వేల నుండి రూ.4 వేలకు పెంచాలని కోరారు.వ్యవసాయ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పదివేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించి మహిళలకు ఉచిత విద్య, వైద్యం, రక్షణ కల్పించాలన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఈ బహిరంగ సభకు ఆలిండియా ఐద్వా జాతీయ నాయకురాలు మాజీ ఎంపీ బృందాకరత్ హాజరవుతున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ ఇందిరాల త్రివేణి, జిల్లా కమిటీ సభ్యురాలు సుందరి రమా, బుద్ధిప్రియాంక, సూరపల్లిఝాన్సీ, ఆత్కూరినాగేంద్ర, రాజ్యం, వెంకటమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీఈ ఏ-2024 అవార్డుకు ఎంపిక

నవతెలంగాణ-ఆలేరుటౌన్
ఆలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా, ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన దూడల వెంకటేశ్‌కి 'టీచర్ ఎక్సలెన్స్ అవార్డు 2024' కు ఎంపికయ్యారు.ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ, స్ప్రై లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 ఆదివారం రోజున నాంపల్లిలోని బిర్లా ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నట్లు శారదా ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.2019 నుండి ఈ అవార్డులు అందజేస్తున్నట్లు వారు తెలుపుతూ, రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ కార్యక్రమనికి కేంద్ర మరియు రాష్ట్ర మంత్రులు కిషన్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోదండరామ్ లు హాజరయ్యి అవార్డులు అందజేయనున్నారని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.



కార్మికుల వేతనాలు పెంచాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు



నవతెలంగాణ-మునగాల
పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు కూడా పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్య క్షులు యం. రాంబాబు తెలిపారు. శనివారం మండలకేంద్రంలో అమరవీరుల స్మారకభవనంలో మైసయ్యగౌడ్ అధ్యక్షతన సీఐటీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో కార్మికుల కొనుగోలు శక్తి పడిపోతున్నందున ప్రభుత్వాలు వెంటనే ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లిం చాలని సూచించారు.కార్మికుల వేతనాలు పెంచి కింది స్థాయిలో వేధింపులు ఆపాలని గుర్తుచేశారు.దీర్ఘకాలికంగా గ్రామపంచాయతీ కార్మికులు సమస్యల పై అనేక పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకర మన్నారు.డిమాండ్ల సాధనకు నవంబర్ 5, 6వ తేదీలలో దీక్షలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం,డి.నాగరాజు, ఎన్.శేఖర్,కె.వీరబాబు, నాగార్జున, సత్యనారాయణ,కోటయ్య, రామకోటి,సిహెచ్ లింగయ్య, ఎస్.నాగరాజు,షేక్‌నబీసాహెబ్, ఎం.వెంకన్న సుందరయ్య,పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుల అరెస్టు అప్రజా స్వామికం

నవతెలంగాణ-దేవరకొండ
గ్రూప్ 1 అభ్యర్థులకు మద్దతు తెలపడానికి వచ్చిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐపీఎస్, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఇతర బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ అప్రజాస్వామికం అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తీసుకొచ్చిన 95శాతం లోకల్ రిజర్వేషన్లు తుంగలో తొక్కే విధంగా ప్రభుత్వం వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాకుండా వికీపీడియా ప్రామాణికం అంటుండటం బాధాకారం అన్నారు. గత నాలుగు రోజులుగా ఎండ, వానా ఆందోళన చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు శోచనీయమన్నారు. ఇకనైనా సిగ్గు తెచ్చుకొని ప్రభుత్వం అభ్యర్థులతో చర్చలు జరపాలి. వాళ్ల వాదన విని ఎగ్జామ్స్ వాయిదా వేయాలి అని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



నవతెలంగాణ-కొండమల్లేపల్లి
బడికి పోయేటటువంటి పిల్లలపై తల్లితండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల కదలికలను గమనిస్తూ వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి ఆర్. నాగేశ్వరరావు నాయక్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు విషయంలో పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిల్లలు పెడదోవ పట్టకుండా ఎప్పటికప్పుడు వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విద్యార్థులు క్రమశిక్షణగా ఉండటంలో ఉపాధ్యాయుల పాత్రతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా చాలా కీలకమన్నారు. బడి నుంచి ఇంటికి వచ్చినటువంటి పిల్లలను ఎప్పటికప్పుడు పిల్లలు హోంవర్క్ చేసే విధంగా చదువుకునే విధంగా తల్లిదండ్రులు చూడాలని ప్రతిరోజు పిల్లలను బడికి పంపించాలని పరీక్ష ఫలితాలలో విద్యార్థులు అధికమార్కులు సాధించాలంటే ఉపాధ్యాయుల పాత్రతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వైస్ ఛాన్స్‌లర్ ను కలిసిన ప్రయివేట్ కళాశాలల యాజమాన్యం

నల్గొండ కలెక్టరేట్:మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌ను ప్రయివేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంజీ యూనివర్సిటీ ప్రయివేట్ కళాశాల అధ్యక్షులు మారం నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు డా బి సూర్యనారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షులు గింజల రమణా రెడ్డి, యూనివర్శిటీ ఈసీ మెంబర్లు డా భాస్కర్ రావు, ప్రవీణ్ కుమార్, అంగ య్యగౌడ్, రాం మోహన్, ఆదిత్య సామ్యూట్, సభ్యంగౌడ్, జానయ్య గౌడ్, యాదగిరి, నర్సింహారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఆర్డీఓ వేణుమాధవ్

నవతెలంగాణ-పెన్‌పహాడ్

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతుధర పొందాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు.మండలంలోని మహ్మదాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ 17 శాతం ఉండే విధంగా ఆరబెట్టి శుభ్రపరిచిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధరావత్ లాలునాయక్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీఎం అజయ్‌నాయక్, ఏవో అనిల్‌కుమార్, ఇన్‌చార్జి సీసీ ఆశ, ఆర్ఐ అజీజ్ ఉన్నిసా, మాజీ ఎంపీటీసీ కొండేటి పవన్, వీటీకే విజయ, సంఘం అధ్యక్షురాలు నీరజ, ఇందిరమ్మ, సునీత, పంచాయితీ కార్యదర్శి లావణ్య, సందీప్ రాథోడ్, శ్రీనివాస్, లాలు, రైతులు, హమలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల ఎంపికలో రాజకీయ జోక్యం వద్దు

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



ఇందిరమ్మ కమిటీల ఎంపికలో రాజకీయ జోక్యం వద్దని సీపీఐ(ఎం) నార్కట్‌పల్లి మండల కార్యదర్శి చెరుకు పెద్దులు మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి కోరారు. శనివారం ఆ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు లబ్ధిదారులను గుర్తించడానికి గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలలో నియమించే వ్యక్తులను రాజకీయాలకతీతంగా పారదర్శకంగా పనిచేసే వ్యక్తులను నియమించాలన్నారు. అలా జరిగితేనే అసలైన పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కమిటీల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా ఎంపిక చేయాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను వేగవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు దండు రవి, శాఖ కార్యదర్శి దండు నాగరాజు, దండు శ్రీను, తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు



కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల ముందు అనేక రకాల వాగ్దానాలు చేసిందని, కానీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించి, రకరకాలకారణాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ అందరికీ మాఫీ చేయాలని, మాఫీ చేసి ఎంతైతే మాఫీ అయిందో తిరిగి అంతా పంట రుణం ఇవ్వాలనికోరారు.రుణమాఫీకి రేషన్ కార్డుతో నిమిత్తం లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. గృహలక్ష్మీ పథకం కిందమహిళలకు2500 రూపాయలుఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 500 రూపాయల గ్యాస్ నేటికీ అమలు కాలేదని, వ్యవసాయ కార్మికులకు నెలకు 1000 వేలు రూపాయల చొప్పున సంవత్సరానికి 12000 వేలు ఇస్తామన్న హామీ ఏమైందనిఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్ని రకాల పింఛన్లుఇచ్చిన మాట ప్రకారంపెంచి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులుకర్నాటి మల్లేశం, మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ, మండల కమిటీ సభ్యులు చిట్టిమల్ల లింగయ్య, కొత్తపల్లి నరసింహ, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోసను పట్టించుకోని పాలకులు

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు..ధాన్యం కొనుగోలు చేయడం మరిచారు
- మార్కెట్లో కుప్పలు తెప్పలుగా ధాన్యపురాసులు
- మార్కెట్లో ధాన్యం పోసి 20 రోజులైనా తూకమేయని పరిస్థితి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి



ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి వేలాది రూపాయలు ఖర్చు చేసి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల వల్ల నష్టపోయి మిగిలిన కొద్ది గొప్ప దాన్యం మార్కెట్లో పోసి రోజులు గడుస్తున్న తూకం వేయని పరిస్థితి రైతుల ప్రభుత్వమని చెప్పుకునే ప్రభుత్వాలు రైతుల గోస పట్టించుకునే పరిస్థితిలో పాలకులు ఉండరు మార్కెట్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడం ఏ ఒక్క అధికారులు స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్‌లో ధాన్యం తూకవేయడంలో జాప్యం లారీలలో జాప్యం రైస్ మిల్లర్లు జాప్యం జరుగుతుందని అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్‌లో పడుగాపులు కాస్తున్న పరిస్థితి రోజులు గడుస్తున్న కొనుగోలు కేంద్రాల్లో వడ్లు రాసులు కుప్పలు పేరుకపోయి ఉన్నాయి.కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న పరిస్థితి రైతులు తెచ్చిన ధాన్యం పైన కప్పడానికి సరిపడా టార్పాలిన్లు లేవు. ఇప్పటికీ70శాతం ధాన్యం మార్కెట్లోనే ఉంది సకాలంలో తూకం వేయకపోవడం రోజుల తరబడి రైతులు నిరీక్షిస్తున్నారు ఇప్పటికీ అకాల వర్షాలతో ధాన్యం కొట్టుకపోయి పంటలు నష్టపోయి రైతులు రీవా ఇబ్బందులు ఉన్నారు మార్కెట్‌లో పోసిన ధాన్యం సకాలంలో కొనుగోలు తూకం వేయకపోవడం ప్రతిరోజు మార్కెట్లో పడి కాపులు కాస్తూ కమ్ముకుంటున్న మబ్బులతో రైతులు దిగులు చెందుతున్నారు.

ధాన్యం కొనుగోలుకేంద్రాలు ప్రారంభానికి పరిమితమా

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పారంభానికి పరిమితం చేశారు.ధాన్యం తూకం వేయడం మరిచారు.రైతంగం సుమారు 70 శాతం వరకు పూర్తిగా వరి ధాన్యాన్ని తీసుకొచ్చి మార్కెట్‌లో పోశారు.పోసిన ధాన్యానికి ఇప్పటికే మార్కెట్ యార్డులు పూర్తిగా ధాన్యంతో నిండిపోయాయని, ఇంకా 30శాతం .వరి ధాన్యం తీసుకు వస్తే పోసేందుకు స్థలమే లేదు.దీంతో తెచ్చిన ధాన్యాన్ని మొత్తం తక్కువ రేటుకు రైస్‌మిల్లులకు అమ్ముకొని నష్టపోతున్నారు.మార్కెట్‌లో పోసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు జరగకుండా చూడాలి.

వర్షాలకు ధాన్యం కొట్టుకుపోయే ప్రమాదం ఉంది వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట రామచంద్రారెడ్డి

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట మార్కెట్‌లో పోసి 20 రోజులవుతున్నా తూకం వేయకపోవడం వల్ల అకాలవర్షాలకు ధాన్యం రాశులు కొట్టుకుపోయయే ప్రమాదం ఉంది.దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. రైతుప్రభుత్వమని చెప్పుకోవడం తప్ప వారికి మేలు చేసేవిధంగా ప్రభుత్వం తీరులేదు.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మార్కెట్‌లోని ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

రైతుసంఘం నాయకులు ప్రసాదం విష్ణు



మండల వ్యాప్తంగా ఇప్పటికే 70శాతం వరికోతలు పూర్తయ్యాయి.రైతులు ధాన్యాన్ని మార్కెట్‌లో పోసి రోజులు గడుస్తున్నప్పటికీ కొనుగోలు మాత్రం జరగడం లేదు .మార్కెట్ అంతా ధాన్యం రాశులతో నిండిపోయింది.స్థలం లేక ధాన్యం ఎక్కడా పోయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు.వారం రోజుల నుండి వాతావరణం వర్ష ప్రభావం వలన పోసిన ధాన్యాన్ని ప్రయివేట్ దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవడం జరుగుతుంది.దీంతో రైతులు నష్టపోతున్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి పరిమితం కాకుండా తూకం వేయడం వెంటనే ప్రారంభించాలి.

రైతుల కష్టం పాలకులకు పట్టదా: కిష్టయ్య



ప్రజా పాలన రైతుల ప్రభుత్వం చెప్పుకునే పాలకులు రైతులు పండించిన పంటను ఎందుకు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వారం రోజుల కింద ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.కానీ ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది.కనీసంరైతులకు మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించలేదు.కూలీలకు రోజుకు రూ.600 నుండి రూ.700 ఇచ్చి ధాన్యం ఆరబోస్తున్నాం.

అంతర్జాతీయ వర్క్‌షాపుకు మిర్యాలగూడ కమిషనర్

నవతెలంగాణ-మిర్యాలగూడ



కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖలోని ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22న న్యూ డిల్లీ డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సర్వే, రీ సర్వే ఫర్ అర్బన్ ల్యాండ్ రికార్డ్స్ అనే అంశంపై అంతర్జాతీయ వర్క్ షాప్ కు తెలంగాణ రాష్ట్రం నుండి 8 మంది మున్సిపల్ కమిషనర్లలో మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ కూడ హాజరు కానున్నారు. ఈ మేరకు ఆ శాఖ సంయుక్త కార్యదర్శి కునాల్ సత్యార్థి 8 మంది కమిషనర్లకు ఆహ్వాన లేఖలు పంపారు. వర్ధన్నపేట, కొడంగల్, జగిత్యాల, జడ్చర్ల, మణుగూరు, హుస్నాబాద్, మహబూబాద్ కమిషనర్లకు లేఖలు పంపించారు. అదేవిధంగా వర్క్ షాప్‌కు వెళ్లాల్సిందిగా రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ విపి గౌతం కమిషనర్లకు అనుమతినిస్తూ లేఖలు పంపించారు.

ఎస్సీ ఎస్టీ బీసీ సంఘ భవనాలను అప్పజెప్పాలని నిరసన

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం వెనుక భాగాన ఎస్సీ ,ఎస్టీ ,బీసీ సంఘ భవనాలు నిర్మాణం పనులు పూర్తి అయి రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఆయా భవనాలను కుల సంఘాల వారికి అందజేయకుండా కాలయాపన చేస్తున్నారని అందుకు నిరసిస్తూ సంఘాల నాయకులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేశారు. భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్ తనకు నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు రానందున తాళాలు వేశామని, బిల్లులు వచ్చిన తదుపరి తాళాలు తీస్తానే కాంట్రాక్టర్ పేర్కొన్న విషయంపై వారు నిరసనకు దిగారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వస్కుల మట్టయ్య, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు తిరుమలగిరి అంజి, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలా సైదులు ముదిరాజ్, పోతుగంటి కాశి, దాసరాజు జయరాజు, జ్వాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు, బోధన రుసుముల బకాయిలను విడుదల చేయాలని వినతి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల యొక్క ఉపకార వేతనాలు, బోధనా రుసుములు బకాయిలను విడుదల చేయాలని ఉస్మానియా జేఏసీ నాయకులు సోమగాని నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీఓ శ్రీనివాసుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రజా కళాకారుడు నర్సయ్య, ప్రజావినియోగదారుల సంక్షేమ సంఘం గరిడేపల్లి మండల అధ్యక్షుడు లింగయ్య, కార్యదర్శి ఎల్లారెడ్డి ఉన్నారు.

శంకరయ్య మృతికి సంతాపం

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలోని 8 వ వార్డుకు చెందిన మూడుదుడ్ల శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ వేర్వేరుగా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

నకిరేకల్ కేంద్ర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మూడు దుడ్ల శేషగిరి తండ్రి మూడుదుడ్ల శంకరయ్య మృతి చెందారు. శనివారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు టి. నరసింహమూర్తి, కురిమిళ్ళ శ్రీనివాస్, ప్రతినిధులు గంగాధర భద్రయ్య తదితరులు ఉన్నారు.

రైతు భరోసా విడుదల చేయాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు రూ. 7500 రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు అందించే ఆర్థిక సాయం ఎకరాకు రూ. 5000 నుండి 7500 ఇస్తామని ప్రకటించి ప్రభుత్వం ఏర్పాటు అయి 9 నెలలు పూర్తిస్థాయిలో గడిచినప్పటికీ నేటికి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేయలేదన్నారన్నారు. రైతు భరోసా నిధులు అందకపోవడంతో అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కొంతమంది రైతులు అప్పుల బాధతో ప్రాణాలు సైతం తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎర్రవెల్లి గంగాధర్, రాయించు నరసింహ, చిలకల మురళి యాదవ్, మహేశ్వర నరేష్, శైలేందర్, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

శవానికి పోస్టుమార్టం

నవతెలంగాణ-గరిడేపల్లి



మూడు రోజుల క్రితం పాతిపెట్టిన శవానికి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన మండలంలోని గానుగుబండ గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. గురువారం మృతి చెందిన షేక్ దస్తగిరి (50) అప్పుల బాధతో ఇంటిలో పెట్రోల్ పోసుకొని మృతి చెందడంతో అదేరోజు ఆచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని బాబాయి కొడుకు షేక్ సైదా మృతుని మరణంపై అనుమానం ఉన్నదని శనివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై చలికంటి నరేష్ తాసిల్దార్ హుజూర్నగర్ ప్రభుత్వ హాస్పిటల్ వైద్యులకు సమాచారం అందించారు. తహసిల్దార్ బండ కవిత, ఎస్సై చలికంటి నరేష్, హుజూర్ నగర్ ఏరియా హాస్పిటల్ సివిల్ సర్జన్ సునీల్ లోహితలు, ఆర్ఐ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి పిడమర్తి నాగేంద్రబాబు సమక్షంలో మృతుని పాతిపెట్టిన స్థలం వద్ద గ్రామపంచాయతీ సిబ్బంది సహాయంతో శవాన్ని వెలికి తీసి శవ పంచినామా నిర్వహించి డాక్టర్లు పోస్టుమార్టం చేసి శవాన్ని పూడ్చిపెట్టారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-వేములపల్లి

ఐద్వా నాలుగవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరు గోవర్ధన శశిధర్ రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 21, 22, 23 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే మహాసభకు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు పాదిలి లక్ష్మమ్మ, కార్యదర్శి అని రెడ్డి మాధవి, జిల్లా కమిటీ సభ్యులు శీలం పద్మ, వ్యకాస సభ్యురాలు పెంటమల్ల సుకన్య, మంగమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

నకిరేకల్ : ఈనెల 21, 22, 23 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే ఐద్వా రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి కోరారు. శనివారం నకిరేకల్ పట్టణంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మహాసభలో మహిళల హక్కులు, వారిపై జరుగుతున్న దాడులు, వారికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల అనుసరిస్తున్న విధానాలపై సమీక్ష నిర్వహించి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుంకి మనమ్మ, ఐద్వా ప్రతినిధులు పన్నాల శశికళ, సోమమ్మ, రేణుక, విజయ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సన్న ధాన్యాన్ని తీసుకొచ్చి బోనస్ పొందాలి

నవతెలంగాణ- చిట్యాల

సన్న వరి ధాన్యం కొనుగోల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా 42 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారి డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వట్టిమర్తి. ఉరుమడ్ల గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్య కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 325 సెంటర్ల గాను 243 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్పీ జయలక్ష్మి, సి సింగిల్ విండో చైర్మన్ సుంకరి మల్లేష్ గౌడ్, డైరెక్టర్ నర్రా మోహన్ రెడ్డి, జడల చిన్న మల్లయ్య, కోనేటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షునిగా అరుణ్ కుమార్

నవతెలంగాణ-శాలిగౌరారం

మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన బోడ అరుణ్ కుమార్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులుగా శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ బలోపేతానికి, రాబోయే స్థానిక సంస్థ ల ఎన్నికల్లో మండల వ్యాప్తంగా గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మునుగోడు

మండలంలోని పలు గ్రామాల్లో రహదారులను నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా 10 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫ్లెక్సీకి శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పాలాభిషేకం చేశారు . ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి , జిల్లా నాయకులుజితేందర్ రెడ్డి , యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్వాయి జితేందర్ రెడ్డి , మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో ఎల్ ఆర్ ఎస్ పూర్తి చేయాలి

- సబ్ కలెక్టర్ నారాయణఅమిత్

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలోని ఇళ్ల స్థలాలు, లే అవుట్లను వారం రోజుల్లో ఎల్ఆర్ఎస్ పరిశీలన పూర్తి చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ అమిత్ కోరారు. శనివారం మధ్యాహ్నం స్థానిక సబ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని గ్రామపంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను ఆయా మండలాల ఎంపీడీఓలు, ఎంపీ ఓలు బృందాలుగా ఏర్పడి దరఖాస్తుదారుల దరఖాస్తులు వాటి సంబంధించిన పత్రాలు, స్థలం క్షుణ్ణంగా పరిశీలించి ఎల్ఆర్ఎస్ కు సిఫార్సు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో డిఎల్ శ్రీనివాస్ శర్మ, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, ఎంపీడీఓలు ఎం. శేషగిరిశర్మ కృష్ణమూర్తి, శారద, ఎంపీఓలు మాతంగి రమేష్, అలి, ఏఈలు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో స్థానిక కార్మికులకే అవకాశం కల్పించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

నవతెలంగాణ-భువనగిరి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్మించబోయే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో స్థానికంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకే అవకాశం కల్పించి వారికి ఉపాధి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కోరారు.శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో భవన నిర్మాణకార్మికులు వందలాది మంది ఉన్నారన్నారు.పక్క రాష్ట్రాలైన ఆంధ్రా, బీహార్, ఒరిస్సా, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక, పశ్చిమబెంగాల్, ఇతర రాష్ట్రాల నుండి వలస కార్మికులు అధిక సంఖ్యలో జిల్లా తక్కువకూలికి పనిచేయడంతో స్థానికంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండాపోయిందన్నారు. దీనివలన కార్మికుల కుటుంబాలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.త్వరలో నిర్మించబోయే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈనెల 31న జరిగే ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి గోరేటి రాములు, ఎండి ఇమ్రాన్, సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, పుట్ట రమేష్, జిల్లా కమిటీ సభ్యులు దాసరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

అనుమతి లేని ఇంటి నిర్మాణం కూల్చివేత

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పట్టణంలోని స్థానిక తాత నగర్ లోని ఇండియన్ గ్యాస్ ఆఫీస్ వద్ద సర్వే నం. 1065/ఎ, ప్లాట్ నం. 15/1లో విస్తీర్ణం 216 స్క్వేర్ యాడ్‌లో భవన నిర్మాణ అనుమతులు పొందకుండా ఇండ్లు నిర్మాణం చేసిన నక్కల పద్మావతి భర్త ఆంజనేయులుకు అనుమతులు లేని కట్టడాలను కూల్చివేసుకొనుటకు గాను నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసిన వాటికి స్పందించనందకు గాను సదరు ఇంటి నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు, పురపాలక సంఘ సిబ్బందిచే కూల్చివేయించామని మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు శనివారం తెలిపారు. పట్టణ ప్రజలందరూ కూడా భవన నిర్మాత అనుమతులు పొందకుండా ఎటువంటి నిర్మాణాలు చేయొద్దని, భవన నిర్మాణానికి అనుమతులు పొందిన తర్వాతే నిర్మించుకోవాలని తెలిపారు.